# కవితా కౌముది - 2016



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 173

# కౌముది లో 2016 సంచికలలో ప్రచురితమైన

# కవితలు


| ఏడాది | నెల | కవిత పేరు | కవి / కవయిత్రి | పేజి |
|---|---|---|---|---|
| 2016 | 01 | అర్థం కాని రంగు | డేగల అనితాసూరి | 6 |
| | | గిప్పుడు జెప్పు.. | బండారి రాజకుమార్ | 7 |
| | | పాదాలు – పదాలు | భమిడిపాటి స్వరాజ్య నాగరాజారావు | 8 |
| | | సంఘర్షణ | చొప్పల్లి సంతోష్ కుమార్ | 8 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 9 |
| | | | | |
| 2016 | 02 | నేను మీలా మారితే | కొనకంచి లక్ష్మినరసింహారావు | 10 |
| | | ఆమే కదా | స్వాతి శ్రీపాద | 13 |
| | | నీ పాదం ముద్దాడిన వేళ | శ్రీమతి నండూరి జ్యోతి | 14 |
| | | ఫేస్ బుక్ విన్యాసం | సారధి మోటమర్రి | 15 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 16 |
| | | | | |
| 2016 | 03 | అంతర్ముఖం | మార్టూరి శ్రీరామ్ ప్రసాద్ | 17 |
| | | చిట్లిపోయిన మొలకవిత్తనం | కొత్తపల్లి ఉదయబాబు | 18 |
| | | చివరి కొడుకు | కృష్ణ మణి | 19 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 20 |
| | | | | |
| 2016 | 04 | కాదేది ఊహాకనర్హం | స్వాతి శ్రీపాద | 21 |
| | | నీ కోసం జలసూత్రం | చంద్రశేఖర్ | 22 |
| | | కిస్మత్ | బండారి రాజకుమార్ | 22 |
| | | శ్రీ"వారికి | అమూల్య | 23 |

| | | | | |
|---|---|---|---|---|
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 24 |
| | | | | |
| 2016 | 05 | నీడల కింద | సురేష్ రావి | 25 |
| | | జాలిపాట | కొండముది సాయికిరణ్ కుమార్ | 26 |
| | | న్యూడ్ మోడల్ | మూలా వీరేశ్వరరావు | 27 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 28 |
| | | ఇంకొంచెం ప్రేమించాల్సింది | డా నారాయణ గరిమెళ్ళ | 29 |
| | | కొడుకు లేడు | పాలపర్తి ఇంద్రాణి | 31 |
| | | వసంత గీతి | డా మాదిన రామకృష్ణ | 32 |
| | | బిగపట్టిన దుఃఖం | జయ రెడ్డి బోడ | 33 |
| | | ఏమిటి ఈ వెర్రి జనం | శ్రీనివాస్ రవితేజ | 35 |
| | | ఊహల్లో ఉగాది | రాధ ఆనుపూరు | 36 |
| | | | | |
| 2016 | 06 | నిశ్శబ్ద గాయం | ఉమా నూతక్కి | 37 |
| | | చెత్త బతుకు | కృష్ణ మణి | 38 |
| | | నీ చూపులో | లలిత చిట్టే | 39 |
| | | మీ అందరికీ తెలిసిన | కొనకంచి లక్ష్మీనరసింహారావు | 40 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 42 |
| | | | | |
| 2016 | 07 | అక్షరం | వసుధ కోడూరు | 43 |
| | | నాలుగక్షరాల మధ్య | గౌతమి | 44 |
| | | వారసుడు | అశోక్ అవారి | 45 |
| | | సానుకూలం | పిళ్ళా కుమారస్వామి | 45 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 46 |
| | | | | |
| 2016 | 08 | నాలో నేను – నీలో నేను | డా జి వసుంధర | 47 |
| | | అమ్మ నాన్న | శ్రీఆచాళ్ళ | 48 |
| | | నాలో కురిసిన కౌముది | లక్ష్మీ రాధిక | 49 |
| | | ఓ 'కడుపు' మంట | ఉమ | 50 |

| | | | | |
|---|---|---|---|---|
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 51 |
| | | | | |
| 2016 | 09 | మనసు అద్దం | సుపర్ణ మహి | 52 |
| | | మౌన శబ్దం | శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ | 53 |
| | | కలల వంతెన | మూలా వీరేశ్వరరావు | 54 |
| | | క'న్నీళ్ళు' | అశోక్ అవారి | 55 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 56 |
| | | | | |
| 2016 | 10 | ఒక్కడినే | శిష్ట్లా వి ఎల్ ఎన్ శర్మ | 57 |
| | | మోడర్న్ మల్లెపూదండ | సాయికిరణ్ | 58 |
| | | గమ్యం | శ్రీమతి దేగల అనితాసూరి | 59 |
| | | దేవుడున్నాడు | బోడపాటి రమేష్ | 60 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 61 |
| | | | | |
| 2016 | 11 | అన్వేషణ | మధుకర్ వైద్యుల | 62 |
| | | ఎల్లో స్టోన్ | రాఘవేంద్రరావు నూతక్కి | 63 |
| | | సందేహం | శారద శివపురపు | 64 |
| | | చిన్ని ఆశ | నీలూ | 65 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 66 |
| | | | | |
| 2016 | 12 | ఊపిరి కొసనే | ఉమా నూతక్కి | 67 |
| | | ఒకడు | శతపత్ర మంజరీ | 68 |
| | | సొంతం | షేక్ షహనాజ్ | 69 |
| | | ఎన్ని? | డా సి భవానీదేవి | 69 |
| | | గజల్ | డా వద్దేపల్లి కృష్ణ | 70 |
| | | రసరేఖలు | శ్రీధర్ బచ్చోటి | 71 |

# అర్థం కాని రంగు

డేగల అనితాసూరి

మనసు కేవలం ప్రేక్షకపాత్ర వహించినపుడు
కొన్నిసార్లు సిగ్గుపడటం
బట్టల వంతవుతుంది,
ఎన్నోసార్లు తిరగనని మొరాయించే
కాలి మడమల్ని బలవంతంగా తిప్పాల్సివస్తుంది,
నాలుకకూడా అంతే..
ఎటుబడితేఅటు మడతలుపడిపోతూ
మాటల్ని అలవోకగా జార్చేస్తుంది,
చేతల్లో చేవలేదని తెలిసినా
చేతులు చప్పట్లకై పైకిలేస్తుంది,
గంతలువిప్పేసినన్యాయం
గ్రుడ్డిగా దర్జాగా బ్రతకమని శాసిస్తుంది,
కీర్తికండువా భుజానికెత్తుకోవడానికి
కనిష్టస్థాయికి దిగజారే దుస్థితి!
పదవిమెట్లను అధిరోహించే ఆత్రంతో
ఉమ్ము మరకల్ని అలవోకగాతుడుచుకుంటూ
ముందుకుసాగే పరిస్థితి !
అరాయించుకోవాలన్నా అలవాటుచేసుకోవాలన్నా
వెలిసిన రంగుల్ని వాటేసుకుని
అనుభవాల అడుగుజాడల్ని అనుసరించాల్సిందే
రాజ్యం....
లౌక్యమెలిగిన లౌకికవాదిదే మరి!!

★★★



## గిప్పుడు జెప్పు..

బండారి రాజకుమార్

సడుగు మీద టక్కరైతే
బందుకు నిలబడి
సోద్దెం జూసే జనాల మంద మనది!
అవ్వా !అని గల్మ ముందు
ఆకలి కేకలు ఇనబడితే
బుక్కెడు బువ్వ ఏత్తానికి
సేతులు రాని లోకమిది !
అన్నదానాన్ని మించిన
దానమొకటుందని
తెల్సుకుంటే...మన పుట్కలు పుర్సతే !
బతికున్న శవాలు
సచ్చినంక అక్కెరకొచ్చుడే
అవయవదానం !!
సిత్రం కదా !
పోయేటపుడు ఏం కట్టుకపోతం ?
పోయిన తర్వాత బత్కాలనే ఖాయిసు ఎందరికి ?
పోయినంక పదిమందికి
పానం బోసుడు ఎంత పున్నెం !
ఇన్నొద్దులు మనిషి
ఎందుకూ పనికిరాని చెత్తబుట్టనుకున్న !
చెత్తను గూడ తిరిగి అక్కెరకొచ్చేటట్టు
వాడుకోవచ్చని తెల్సింది !!
పరులసేవకోసమే ఈ షేత్ర అని
ఎవరన్నరోగని గాయిన కాళ్లు మొక్కాలె!
గిట్లనన్న మనిషి అక్కెరకొత్తానందుకు
మస్తు సంబురమైతాంది
గిప్పుడు జెప్పు !
కాష్టాల గడ్డకు దానమైతవా ?
కష్టాల బిడ్డకు దానం జేత్తవా ??

* * *

## పాదాలు - పదాలు
భమిడిపాటి స్వరాజ్యనాగరాజారావు

పాదాలు రెండే అయినా,
ఎన్నిఅడుగులనైనా వేయవచ్చు.
పదాలలోని అక్షరాలు కొన్నేఅయినా,
ఎన్ని కవితలనైనా రాయవచ్చు.
గమ్యాని కనుగుణంగా
పాదాలు కదులుతాయి.
భావాని కనుగుణంగా
పదాలు మెదులుతాయి.
గమ్యాలు అనంతం కావచ్చు,
భావాలూ అనంతమే!
నడక,నడత రెండూ గమ్యానికి ముఖ్యమే!
భావము,భాష రెండిటితో పదానికి సఖ్యమే!
పాదాలు జీవితాన్ని కొలుస్తాయి,
పదాలు కవిత్వాన్ని మలుస్తాయి.
సున్నితమైన పాదాలు
అడుగులకు అందాన్నిస్తాయి,
సునిశితమైన పదాలు
కవితతో అనుబంధాన్ని వేస్తాయి.
చక్కని బాటలవెంట పాదాలు నడిస్తే,
పయనం హాయిగా అనిపిస్తుంది.
చిక్కని పదాలతో భావాన్ని ముడేస్తే,
కవిత్వం చదువ ముచ్చటేస్తుంది.
బాట గమ్యాన్ని నిర్దేశిస్తుంది,
కవిత హృదయాన్ని ఆవిష్కరిస్తుంది.
ప్రతీ గమనం గమ్యాన్ని చేర్చలేక పోవచ్చు,
ప్రతీ కవిత హృదయానికి
ఆనందం చేకుర్చలేక పోవచ్చు.

★★★

## సంఘర్షణ - చొప్పల్లి సంతోష్ కుమార్

సంఘర్షణ,
మనిషికీ, మనసకూ నడుమ సంఘర్షణ
ఓటమిని ఒప్పుకోలేకనో,
ఓరిమిని అలవర్చుకోలేకనో,
మనిషి తనతో తాను గడపలేకపోవడం చేతనో,
ఏమో..!!
ప్రతీ వ్యక్తిలోనూ ఆవేదనతో కూడిన సంఘర్షణ.
మెదడు మొదళ్ళలో మొలిచే
అనంత ఆలోచనల వలయంలో
కూరుకుపోతోంది మనసు..!
విచక్షణా కళ్ళాన్ని వదిలి
పరుగులు తీస్తోంది మనసు,
పరిష్కారం తనలోనే ఉందని తెలియక..!

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వెల్లువై వెన్నెలలు బయలెల్ల నిండి
చల్లని వెలుగులో పుడమెల్ల నింపె
తెల్లని వలువతోనిలనెల్ల గప్పె
జగము సర్వము నిదురలో జారుకొనగ

కలతలను మరచి పలు దుఃఖముల మరచి
సంతతమ్మును పడునట్టి శ్రమను మరచి
కష్టమన్నది లేక సుఖమును లేక
నిదుర పోవగ పాడె వెన్నెలలు జోల

ఎచటనో తిరిగి చివరకిల్లు చేరి
ఒక్క నిమిషము విశ్రాంతినొందినట్లు
బ్రతుకు బ్రతుకెల్ల పరువులు పరువులెత్తి
ఇంక చాలని కోరుదునింత నిదుర

ఎంతయో ప్రశాంతి హృదయమెల్ల నిండి
విడుతు వేగిరపాటును వెతలు మరతు
ఎన్నడెరుగని యానందమేదొ పొంది
జ్ఞానమును వీడి నిదురలో జారిపోదు

గతము గతియించి హిమమట్లు కరిగిపోయి
తెలివి యెరుగని నిశ్చలస్థితిని పొంది
తిరిగి మేల్కొని కన్నులు తెరచినంత
ఇదివరకు లేని జీవితమెదుట నిలిచె



# నేను..మీలా మారితే..!

కొనకంచి లక్ష్మీనరసింహారావు

వాన కడిగిన సముద్రం మధ్య ..
ఉదయపు కొత్త మలిన రహితపు పొద్దులో,
మీరంతా
కనుచూపు మేర కొత్తగా పూసిన
మొగలిపూవుల బొత్తుల మైదానంలా కనిపిస్తారు.

మీ కళ్ళల్లో నాకు ఎక్కడ చూసినా
రవ్వంత నల్లగా
చిన్న దిష్టిచుక్క కూడా కనిపించదు.

మీరంతా..
వినమ్రంగా అక్షరాల ఆకాశంలో
ఆడుకుంటున్న
బాల నెలవంకల గుంపుల్లాగా కనిపిస్తారు.

మీరంతా..
మసక చీకటి సాయంత్రం
అప్పుడే విరబూసిన
రుద్రాక్ష పూలవనంలా కనిపిస్తారు.

మీరంతా ..
తమ తేనె తుట్టే నించి
తమ తేనె తామే తాగి
మత్తుగా నిద్రబోతున్న
తేనెటీగ పిల్లల్లా కనిపిస్తారు

ఇంకా మాటల్లో విశదీకరించాలంటే,
నా రైటింగ్ టేబుల్ ముందు
నేను రాసుకునే తెల్ల కాగితాల మీద
పసిపాపలా కేరింతలు పెడుతూ
కాళ్ళూ, చేతులు తపతపా ఆడిస్తూ
బోసి నవ్వులు నవ్వుతున్న పసికూన సరస్వతీదేవి
దేవతాగ్రుహం ముందు
సంజె వేళ్ళల్లో వెలిగే ..
సరికొత్త జ్ఞాన జ్యోతుల్లా కనిపిస్తారు.

ఇంకా చెప్పాలంటే ..
రేపటి నా కవిత్వం అస్థిత్వపు
ఎడారి నిశ్శబ్దపు రాకాసి కోనల్లో
అప్పుడే మొలకెత్తుతున్న
ఆకుపచ్చటి కాలిబాటల్లా కనిపిస్తారు.

2

నాగరికత అంటే
మనుషులంతా
ఒకళ్ళ కాళ్ళకింద మరొకళ్ళు
చితిపేర్చుకోవటం చితిని అంటించుకోవటం.

నాగరికత అంటే మరేమీకాదు
ఊళ్ళన్నీ స్మశానాలు కావటం,
స్మశానాలన్నీ ఇరవై నాలుగ్గంటలూ ..
తాజాగా తగలబడుతున్న శవాలతో
కాష్టాలన్నీ మండుతూ కళకళ లాడటం.

స్మశానలకు పండగరోజులొచ్చేది
మనుషుల శవాలతోనే..
స్మశానాలకి వసంతమొచ్చేది కూడా
కొత్త కొత్త శవాలతోనే .

స్మశానాలను సస్యశ్యామలం చెయ్యటానికి
ప్రభుత్వాలన్నీ మనిషిని మార్కెట్లో పెట్టి
ఎదుటి మనుషుల చావుని
తనివితీరా యెంజాయ్ చెయ్యటం ఎలాగో
నేర్పుతున్నప్పుడు,
అర్ధ రాత్రుళ్ళు స్మశానాలల్లో స్త్రీలంతా ..
దుఃఖిస్తున్నామనుకునే బాధలో ఉన్మత్తారాంద్రై...
జీవిత యుద్ధంలో తెగిపోయిన తాళిబొట్ల కోసం
చితిమంటల వెల్తుర్లల్లో వెతుక్కుంతుంటారు.

చాలామంది మనుషులకి ఊర్లుంటాయి
చాలామంది మనుషులకి పేర్లుంటాయి
చాలామంది మనుషులకి సొంతమంటూ
ఆఖరికి సొంత చావులు కూడా ఉంటాయి.

తాము చావుకోసమే పుట్టామని తెలుసుకోని
మనుషులు మందలు మందలుగా ...
పొడుచుకుంటూ తొక్కు కుంటూ...
బ్రతుకుకోసం పరుగెడుతున్నామనుకునే భ్రమతో
చావు వైపు పరుగెత్తుకుంటూ వెళతారు.

అనవాళ్ళేమీ  భూమి మీద లేకుండానే
పంచవన్నెల మృత్యు సముద్రంలో
తమకు తెలియకుండాన మునిగిపోతారు ..

కానీ మీరలా కాదు..

పిచ్చుక గూట్లో
సృష్టి కర్త దాచిన రహస్యాన్ని
మీ అక్షరాల భూతద్దాలతో ..
పరిపరి విధాలుగా శోధిస్తారు.

మనుషుల భగ్న స్వప్నపు మంటల్లో
మాడిపోయిన దీపపు పురుగుల రెక్కల్లో
రాలిపోయిన ప్రాపంచిక సార్వకాలీన
సత్యాలని దృశ్యాలని శోధిస్తారు.

మీరు మీ అక్షరాలతో
కొన్ని కొత్త ప్రపంచాలకు
మాతృ రాజ్యాలుగా వెలిగిపోతారు.
మీరు మీ అక్షరాలతో
కొన్ని కొత్త భావాలను
వెలిగించే విద్యుత్ గీతాలుగా వెలిగి పోతారు.

ధ్వంసమయిన వ్యవస్థ లోంచి
విధ్వంసమయిన ప్రాపంచిక నిజాలల్లోంచి
కొత్తా పునఃసృష్టిగా మీరు
రక్తపు చేతులతో  ఎత్తిపట్టుకున్న  కొత్త జెండాలమీద
సూక్ష్మ రూపంలో నేనుంటాను.

మీ చేతుల్లో నేను పెట్టిన అక్షరాల విత్తనాలతో
మీరంతా వందల.దుర్గమారణ్యాలని..
నా గుర్తుగా ఈ ప్రపంచమంతా
గర్వంగా విత్తనీకరిస్తారు.

మిమ్మల్ని మీరు కవిత్వీకరించుకుని
కవిత్వంటే సమరగీతం అంటారు
కవిత్వమంటే సింహనాదమంటారు
కవిత్వం అంటే యుద్ధనేత్రమంటారు.

మీ అక్షరాల్లో అక్షరాలుగా కలిసిపోయిన
నా రంగు రంగుల చిత్రాన్ని..
మీ చేతుల్లో ఉన్న జెండాల మీద అచ్చేసి
యుద్ధ విజేతల చిరు నవ్వులతో కలిసి
అక్షరమయంగా విశ్వమంతా గర్వంగా ఎగరేస్తారు .

3

రాజ్యం మనుషుల్ని పీక్కుతినే
వేయికాళ్ళ రాబందు అయినప్పుడు..
రాజ్యం అస్వతంత్రపు, పరాధీన,
అమాయక ప్రజలని దోచుకుని తినే
నరమాంస భక్షకి అయినప్పుడు
మీరంతా విధ్వంసక ఖడ్గాలవుతారు.
మీరంతా విజృంభణ గీతాలవుతారు.
మీరంతా ఆగ్రహ నేత్రాలవుతారు.
మీరంతా  దాగున్నదావానలా లవుతారు.

పిచ్చిదానిలా దిశ మొలతో
దిక్కు తెలీక తిరుగుతున్న
దేశమాత ఒంటిమీద..
నా వారసులుగా మీరంతా
దుఃఖనేత్రాలతో విశ్వవస్త్రాన్ని కప్పుతారు .

నేను నేను కాదు....మీరంటే ..నేనే..
నేను మీరు కాదు..మీరంటే మనమే !!

4

మీ కలల్లో మీరు కలగనే
యవ్వనమంటే నాకు ఇష్టం
మీ ఊహల్లో మీరు చూసే
దృశ్యాలంటే నాకు ప్రేమ.

నా కవి బాల్యాన్ని
మళ్ళీ నేను పొందలేకపోయినా
మీ బాల బాల్యం అచ్చం
నా ఒకప్పటి కవి బాల్యం లాగే
కొబ్బరి నీళ్ళల్లా అంతా స్వచ్ఛం..స్వచ్ఛం..!

మిమ్మల్ని చూడగానే ..
నాఎదురుగుండా ఉన్న అద్దంలో
నాక్కనిపిస్తున్న చిత్తరువులో..
నాచేతుల్లో ఉన్న ముత్యాలదండ తెగి
చెల్లా చెదురుగా చెదిరిపోయింది.
నా కవి బాల్యం ముత్యాలని
వెనక్కి తిరిగి ఎన్నిసార్లు వెతికినా
ఒక్క ముత్యం కూడా దొరకలేదు.

తల నెరుస్తుందంటే ..
మనిషిలో ఉన్న చెరువు
ఎండటానికొస్తున్నట్టే !
ఎండిపోయిన చెరువులాంటి వయసులో
కూలిపోయిన ఆకులని ..
ఎలావెతుక్కోవాలి?

అసలు ఈ మనుషులెంత దురదృష్టవంతులు?
తాము జీవితంలో ఏం పొందారో
ఎవరూ సరిగ్గా గుర్తించలేరు.
తాము జీవితంలో ఏం పోగొట్టుకున్నారో
జీవిత కాలంలో ఎవరూ గుర్తించలేరు.

ఒక భావం కూడా లేకుండానే,
కూరగానో ...కలపగానో
అస్థిత్వాన్ని మిగల్చకుండా చచ్చిపోతుంది!

5

నిజమే కదా..
విత్తనానికి తెలీదు
తను ఓ విత్తనాన్నని!
తనకు తెలియకుండానే,
ఒక భాషకూడా లేకుండానే,

ఒక భావం కూడా లేకుండానే,
కూరగానో ...కలపగానో
అస్థిత్వాన్ని మిగల్చకుండా చచ్చిపోతుంది!

కానీ  తాతయ్యగానో పెదనాన్నగానో
మీరు మీ రేపటి తరాలకు చెప్పే
మీ నిన్నటి కథల్లో నేనుంటాను.
ఖచ్చితంగా ఓ కందెన లాగా
వెలుగుతుంటాను .

కాలప్రవాహంలో
నదీప్రవాహం కూడా ..
ఓ భాగమయిన చోట
మీ అక్షరాల జీవనదిలో
ఓ కొత్త పురాతనంగా నేను కలిసిపోయే
ఉంటాను !

మీరు రాసే గీతాల్లో
మీకు తెలియకుండానే
మొలిచిన పచ్చటి చేను నవుతాను!
మీకు తెలియకుండానే మీ చేతుల్లో
మిగిలిపోయిన మట్టి నవుతాను!!

★★★★

# ఆమే కదా..

స్వాతి శ్రీపాద

అనాది కాలం నుండీ ఆమె కదా సమస్తం
కరిగి నీరైనా, ఘనీభవించి పాషాణమైనా
పరిమళించి పన్నీటి ప్రవాహమైనా
పరిభ్రమించి కన్నీటి సముద్రమైనా
అన్నీ ఆమే కదా!
దేహమైతేనేం అది గేహమైతేనేం
మనికైనా మనసైనా నీడలైనా గోడలైనా
నిజానికి ఒక విశ్వరూపం ,
ఒక చరా చర జగత్తు ఊపిరి రూపం !
ఆమే కదా  అవును ఆమె కదా,
గతమూ వర్తమానమూ నిన్నా నేడూ రేపూ ,
ఆధునికతో అనాగరికతో చరిత్ర పుటలో ,
రేపటి కథలో కలవరింతలో పలవరింతలో ,
ఆమె లేనిదేదైనా ఒక శూన్యమేగా!
ఉమ్మడి ఆస్తినుండి ఊరుమ్మడి బతుకు నుండి
కొండ గుహలు దాటి వనాలు దాటి ఎడారులు దాటి
గోడల మధ్యకు అతని వెనక ఇష్టంగా నడచి వచ్చినదీ ,

అమ్మయినా ఆటబొమ్మయినా అలంకరించిన సౌకుమార్యమయినా
కావ్య కన్యవంటూ మునగ చెట్లు ఎక్కించి నపుడు
నును సిగ్గుల అక్షరమై పుటల మధ్య వికసించినదీ,
అష్టవిధనాయిక వన్నప్పుడు శృంగారభంగిమై
గుళ్ళూ గోపురాలపై రాతి విగ్రహమైనదీ,
ధీరోదాత్త వన్నప్పుడు రణరంగపు సుడిగాలిగా మారినదీ
రాజ్యాలేలమంటే  రాజకీయాలు నడిపినదీ
ఆమే కదా...... ఆమే కదా .....!
ఉత్తుంగతరంగపు త్యాగాశీలగా అగ్ని దూకినదీ
సమస్త కళావైభావాన్నీ అరచేత చందమామ వైనమన్నదీ
ఆమె కదా !
ఆమె కదా ప్రణవనాదం ఆమె కదా ప్రళయ వేదం !
ఆమె కదా ప్రకృతీ ఆమె కదా వికృతీ !
కనిపెంచే అమ్మయినా కమ్మని అనురాగపు కొమ్మయినా ,
ఆమె కదా జీవన గమనపు బొంగరాన్ని గిరగిర తిప్పే ములికి ,
వికారాలకూ వినోదాలకూ విలాసాలకూ వేలవేల అపహాసాలకూ ,
ఎన్ని ఆమెను చేసినా
నిన్న ఆమె రేపు ఆమె నీ రూపం ఆమె కనుచూపూ ఆమే. !
చివరికి చితిపక్కన రెండు కన్నీటి చుక్కలూ ఆమే.!!

★★★



# నీ పాదం ముద్దాడిన వేళ..

శ్రీమతి నండూరి జ్యోతి

అందమైన భావాలను మనసు గుప్పిట్లో భద్రపరచుకొని
జీవిత ప్రయాణపు అలసటను అలవోకగా మరిపించగల మధుర క్షణంలా..
ఊహకందని ఊసులు పాలకడలిలో చిలకబడి ప్రాణధారలా
నా దేహాన్ని తడిమి అమృతాన్ని నింపగల తొలకరి జల్లులా
స్పృశిస్తుంటే నాలో నీ ప్రాణానికి పవిత్ర గంగోత్రిలా అంకురం జరిగి,
వింటి నారిన గురి పెట్టిన బాణం హృదయాంతరాలలో స్పందనను
కలిగించింది.

వికసింపబోయే పూల పరిమళం పలకరించినట్టుగా
పరవశించిన మనసేదో పులకింతగా మారింది
మనోకాగితం మీద గీసిన చిత్రం రూపు దిద్దుకుంటుంటే
నా కళ్ళలో మెరుపులు చిందిస్తూ మైమరపిస్తుంటే
ఎరుపెక్కిన చెక్కిలి ముద్దమందారమైంది !!
బాహుభంధాలలో మైమరచిన క్షణం స్వర్గపు అంచులను తాకింది !!

తనువులో భాగంగా మనసులో భావంగా
తనువులో ప్రాణంగా, మనసులో ప్రాణంగా మలచిన "నాలో నీరూపం"
ఆ క్షణం నీతో ముడిపడిన బంధం అజరామమైనది !!
నవమాసాల బరవడి ఒక మధుమాసానికి ప్రతీకగా
నా అణువణువు నలిగి నీకు ప్రాణంపోస్తుంది !!

నీలో శబ్ధనాడులు స్పందిస్తుంటే,
నా దేహం పండువెన్నెలలో వేణుగానాన్ని నీకై ఆలపిస్తుంది...
నాలో ఉప్పొంగే జీవనదిలో నీ తొలి కదలిక
నన్ను మబ్బు వాకిట కళ్ళాపి జల్లి నీ రాకకై ముత్యాల ముగ్గులు
వేయిస్తుంది.....
స్కానింగ్ కిరణాలు నిన్ను తాకి నీ రూపం నా ముందు ప్రతిబింబిస్తుంటే,
నువ్వు తేజోయమానమై శోభిల్లమనే ఆశీస్సులు
నా కన్నులలో ప్రకాశించిన తేజోకిరణాలై నిన్నుతాకి ముద్దాడుతాయి !!
నిండు గర్భిణిగా నలత చెందిన నేను నిస్సత్తువగా మారినా,
నా ఊపిరి నీకు ప్రాణం పోయాలనే తపన
నీ చిలిపి చేష్ఠలకై పసిపాపలా మారుతుంది.......!!

నరనరాలను తెంపే పురిటినొప్పులు నీ చిరునవ్వుకోసం
వాయువేగంతో ప్రాణాక్షతలుగా మారాయి...!
నిన్ను ఈ ప్రపంచానికి తేవడానికి శ్రమిస్తూ
నవనాడులూ తెగి
కట్టలు తెంచుకున్న రక్త ప్రవాహం నీకై పూల పాన్పును పరిచింది.....
నాలోనుండి వచ్చే ప్రతి చెమటబిందువూ
ఆనందద్వారాలకు నిన్ను స్వాగతిస్తూ పచ్చని తోరణాలయ్యాయి !!
పురిటినొప్పులకు కంటతడి పెట్టించి,
నా కంఠం నుండి వచ్చే ప్రతి అరుపూ
నీ రాకకు మంగళ వాయిద్యాలయ్యాయి !!

గెలుపు వాకిలిలో నీ తొలి ఏడుపు వినపడటానికి,
నేను నీకై ప్రాణత్యాగం చేసి మళ్ళీ జన్మిస్తానంటూ
నా మనస్సు వేదపఠనం చేస్తూ శుభగడియకోసం వేయి కళ్ళతో
ఎదురు చూస్తుంది.....

నా ఈ కష్టాన్ని ఇష్టంగా పటాపంచలు చేస్తూ....
నడయాడే నీ కాళ్ళు నన్ను స్పృశించినపుడు
నిన్ను నా చేతుల్లో తీసుకొని
నీ కళ్ళలో చూస్తూ ..... నీ పాదం ముద్దాడిన వేళ.........

★★★



# ఫేస్ బుక్ విన్యాసం

సారథి మోటమర్రి

లేరు లేరు లేరని
పుస్తక చదువరులే లేరని
వాపోత రెందుకు కొందరు –
ఎటు చూసినా ముఖ పుస్తక మానులే!
అలనాడు పుస్తకమంటే తలదిండు –
చదివేము అమాశ నాటి వెన్నెలలో ... వెన్నాడే ముఖపొత్త మీనాడు
– చరవాణి తెరపై – కాలాన్ని నిర్జించి!
యుగాల మానవ చరితలో –
కొన్నే హాసాలు, మరెన్నో పురాణాలు...
గణన యుగంలో.. ఎందరో వ్యాసులు –
ఎదుటి వారికి వడ్డించేరు బూరెలు...
కదిలినా.. మెదిలినా.. నీరోలికినా...
మెచ్చినా.. నొచ్చినా.. ఆవులింతలొచ్చినా –
రానేస్తాం కీబోర్డు బలపాలతో –
సాంఘిక జాలంలో మా ఉనికిపాటులు...
అమ్మలక్కల ఊసులు పోయే –
పెదబాబుల రచ్చబండలు పోయే...
పంచుకుంటాం ముఖపేజీల కూడలిలో –
తుమ్మినా.. దగ్గినా .. నన్నే చూసుకోమని!
రాతల కూతలు కోటలు దాటుతుంటే –
మాటల మురిపెం తేనెలు ఊరే...
మోముల మమతల జిలిగులు రానే –
చేతుల దులిపే దగ్గరున్న బూడిద...
విలువైన కల్పనకు లైకులంద –
ప్రతి లైకులు ఆశించే వారెందరో ...
నచ్చితే, మెచ్చితే.. చెలిమి హెచ్చే –
కాకుంటే – 'కా'కులమని బిరుదు వచ్చే!

ఉనికి ఉలుకు కునికిపాటులలో –
నిజమెంత.. ఉత్ప్రేరకమెంత?
ఆవగింజ? గుమ్మడా? ఏ గుమ్మడి?
ఎవరి గుమ్మడి? ఎక్కడి గుమ్మడి?
ప్రచారాల ప్రభంజన సమాహారంలో
స్పందించే.. పరావర్తన చెందించే...
ఉనికిపాటుల అంతర అర్థం –
నేతి బీరకాయల నేతి వంటేమో?
అద్దంలో నామోమే ముద్దువచ్చి –
నాకే నచ్చే కదా ఈ బింబమని...
పలుగురికి పంచ అనుదినం-
అరుదెంచె సెల్ఫీల ముఖ పర్వం!
నేనేడ బోయినా.. నేపు లేవనే –
నేనేది తిన్నా.. నీకు పంచలేదనే –
కంటికి.. పంటికి.. బాధేలనోయి!
అన్నిటిని నింపే ముఖపేజీ ఉండగా!
కొందరని.. ఇస్తే తిరిగి రాదని –
నిజ పొత్తమే కరువయ్యే.. కనుమరుగయ్యే...
నింపిన నీ పేజీ నీది కాదని –
నిన్నుమరిచి పంచుకొనే వారందరిదని...
ఆహ్లాద భావనలకు రూపమిచ్చే వారొకరని
ఊరకే హా! హా! లు రానే వారిందరని -
అద్వైతమే నిజమని – పుటలు వేరైనా –
అలరించే ముఖపొత్తం ఒకటేనని!!

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఈ యడుగుజాడలెవ్వరివోయటంచు
ఇచటి నూతన మారుతమెచటిదంచు
ఈ కొలని యలలకు హేతువెవ్వరంచు
అచ్చెరువుతోనిచట తిరుగాడుచుందు

ఎవ్వరును లేరు, కానరారెచటనైన
ఇది నిజము కాదొ, నా హృదయేచ్ఛయేమొ
మనసదెల్లను వ్యాకులమయము నేడు
నా హృదంతరమందు శూన్యతయె నేడు

వలయునెవ్వరో యొకరు నా పంచ నిలువ
సూటిగా పోవు మార్గమ్ము చూపు కొరకు
చేరి చెవిలోన ధైర్యమ్ము చెప్పు కొరకు
వలయునప్పుడు జ్ఞానమ్ము పంచు కొరకు

ఎరుగనిచటుండిరో లేరొ యెవ్వరైన
తోడుగా ప్రక్కనున్నట్లు తోచుచుండు
ఒంటరిని సృష్టియందన్న యూహ భయము
ప్రక్కనెవ్వరో యున్న భావనయె నయము

కష్టములు వేనవేలుగ కలిగినపుడు
భాగ్యములు మెండు వెల్లువై వచ్చినపుడు
చిత్రమిదియేమి యంచునచ్చెరువు కల్గు
చిత్రకారుని కానగ చిత్తమరుగు



చిత్రం:కె.రామ్మోహన్

# అంతర్ముఖం

మార్టూరి శ్రీరామ్ ప్రసాద్

మనస్సంతా చీకాకు నింపుకున్నప్పుడు
నిస్సత్తువును ఒంపేసి
శక్తిని నింపుకునేందుకు
ప్రతిరోజూ
నన్ను నేను పునరుత్తేజం చేసుకుంటాను!
ఆలోచనలను అంతం చేస్తూ
గట్టిగా కళ్ళు మూసుకుని
ఈ ప్రపంచానికి దూరంగా పోయి
నన్ను నేను తెలుసుకోడానికి
కొత్త చైతన్యం కోసం
మనస్సులో వెలుగులు నింపుతాను!
నీరసించిన శరీరానికి
మనసుకి
పునరుత్తేజం కొరకు
నాలో నేను అంతర్ముఖుడనై
నన్ను నేను చూసుకుంటాను!
నాలో అమృతత్వాన్ని
నింపుకునేందుకు
నాలో ఉన్న లోపాలు సరిచేసుకునేందుకు
భూమినుండి విత్తనం చీల్చుకువచ్చినట్లు
నాలోని నిరాశా, నిస్సత్తువుకి రంగుమార్చి
కొత్తవెలుగులు నాలో నింపుకుని
సరికొత్త వెలుగులతో ఉదయిస్తాను!
మనసే అన్నింటికీ మూలమని తెలుసుకుని
ప్రశాంతత వైపు సాగుతాను..!!

★★★★



చిత్రం – అజ్జరపు నరసింహారావు

# చిట్లిపోయిన మొలకవిత్తనం

కొత్తపల్లి ఉదయబాబు



మెలకువ వచ్చీ రాగానే ఒక మొలకెత్తిన ఉదయం
కనులముందు నమస్కరిస్తూ నిలబడుతుంది,
పక్షులన్నీ మత్తువదలని విక్రమార్కుడి మాస్కులతో...
జీవన వేటకు సాగిపోతుంటాయి,
రాత్రల్లా నిశ్వాసించి చల్లబడిన పచ్చని చెట్లు
కిరణజన్య సంయోగ క్రియ వంటపనిలో పడతాయి,
ప్రశాంతంగా కోడి కునుకుతో సాగుతున్న సెలయేళ్ళు
పిల్లతెమ్మెర్ల రాకతో కేరింతలు మొదలెడతాయి,
నిప్పులాంటి నిజాలు
ఇజాలు వదులుకుని...వేడెక్కుతున్న వాతావరణంలో
సెటిల్మెంట్ల దారులకోసం అన్వేషిస్తుంటాయి,
సూర్యుని ప్రయాణం సగం పూర్తయ్యేసరికి
ప్రభుత్వ పచారీకొట్లలో నర్సులకు తెల్లవారుతుంది,
దేవుడిచ్చే వరం కోసం పూజారులు
శఠగోపాన్ని నమ్మిన భక్తుల నెత్తిన పెడతారు,
నెరవేర్చని వాగ్దానాలు రాజకీయపు
బండపెదవుల వాకిట్లో తారట్లాడుతుంటాయి,
కోట్లను మింగేసే బినామీలు పార్టీల కొంగుచాటున
" చూడు పిన్నమ్మా " ఆటాడుతుంటాయి,
ప్రేమించి ప్రేమను పంచే ఆడది
అమ్మగా నటించేందుకు క్లాప్ కొట్టడం నేర్చుకుంటోంది,
మనిషిగా మరణించిన నాన్న
రెండుకళ్ళ సవారీ బ్రతుకు రంధ్రాన్వేషణ చేస్తుంటాడు,
విలువలన్నీ పుడుతున్న బాల పసిమొగ్గలి
మానాల కాపలాకు దవాఖానాలకు చేరుతుంటాయి,
కుటుంబాలు రెల్లుపొదల్లా విచ్చిపోయ.
ఆకాశ హర్మ్యాల రెక్కల్లో ఒదిగిపోతుంటాయి,.
కోల్పోయిన మనశ్శాంతి ఫలాలు ముళ్ళబ్రతుకుల మధ్య
ధనరాసులతో బేరాలకు సిద్ధమౌతున్నాయి,.
లేచిపోయి ముచ్చట దీర్చుకున్న యువజంట కొత్త కోరికలా
రేపటి ఉదయపు ప్రభవంకోసం మరో రోజ సిద్దమౌతుంది!!

★★★



# చివరికొడుకు

కృష్ణ మణి





వీడు
ఏ ధర్మాన్ని ఆచరించాలో చెప్పు,
ఏ బట్టకట్టాలో
ఎలాంటి తిండి తినాలో
అదీ ... ఎలా తినాలో చెప్పు!

సమాజంలో ఇప్పుడు వీడు
ఒక ఆనాథలా కంటతడి పెడుతున్నాడు
వాడు రాలుతున్నాడు
కరెంటు తీగలపై ఒంటరి పిట్టలా !

మనషుల మధ్య మమతల కోసం వాడు
గుండె మండి గుడి గంట కొడుతున్నాడు
దర్గా మెట్లెక్కి ''యా అల్లా'' అంటున్నాడు
చర్చికెళ్ళి రోదిస్తున్నాడు ''జీసస్'' అని!

వాడిప్పుడు పరాయివాడు
ఎవడూ మావాడనరు వాడ్ని

వాడు
భూతద్దంలాంటివాడు
వానిలోంచి చూస్తే మన మనసు పెద్దగా దర్శనమిస్తుంది
పక్కవాడు నవ్వుకునేలా

వాడు
పరిగెడుతున్నాడు
మనం మనుషలమని
ఒలంపిక్ కాగడలా చేతిలో దివిటిని చేతబూని
అంధకారాన్ని తరిమేద్దామని

మానవత్వానికి చివరి కొడుకు వాడు
వాడు చస్తే లోకం చచ్చినట్లే
మనిషిని భూతద్దం పట్టి వెతకాలప్పుడు !!!

****

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎచ్చటనొ యుంటివీవు నేనిచటనుంటి
ఒక్క చోటనె యుంటిమి యూహలందు
ప్రక్కనే యుంటివనిపించు భావమందు
ఉనికి నీ ప్రక్క నాకు నీ మనసునందు

లక్క పిడతలతోనాడు బొల్యమ్మునందు
వండి వార్చిన యుత్తుత్తి వంటకముల
ఎలమితో నేస్తములకు వడ్డించినట్లు
ఇచ్చుకొనుచుందుమెన్నియో యిరువురమ్ము

ఈ పదార్థములీవారగించినట్లు
ఈ మృదుల తల్పమున విశ్రమించినట్లు
నెనరుతోనిచ్చు కాన్కల గొనిన యట్లు
తలచుకొనుచుందునూహల మెలగుచుందు

జీవితము మిథ్య యంచును చెప్పుచుంద్రు
మిథ్యయే నిజమంచు నమ్మితిని నేడు
సంతసమ్మైన వెతయైన స్వాంతమందె
జీవితమ్మూహ – ఊహయే జీవితమ్ము

ఇచ్చటున్నను లేకపోయినను గాని
ఉందువెల్లకాలము నా యూహయందు
చెంత లేవిపుడే నిజజీవితమున
నిజము గతమయ్యె తలపులే నిజములయ్యె



చిత్రం:కె.రామ్మోహన్

## కాదేదీ ఊహకనర్హం..

స్వాతీ శ్రీపాద

ఆకాశం కరువైనా ,
కాళ్ళకింద నేల ప్రియమైనా
శీతగాలి పెను వేసవి గుప్పిట్లో సొమ్మసిల్లిపోయినా,
గుండె పగిలి హరిత వనాలు ఎండు గడ్డిపోగేసినట్టు లేత
పసుపును అద్దుకున్నా,
నక్షత్రాలు ముక్కలుముక్కలై వజ్రపు రజనులా చీకటి నుసిలోంచి
రాలుతున్నా,
ఋతువులు భీష్మించుకు అలిగి బిగదీసుకుపోయినా,
ఇబ్బందేమీ లేదు...!
అలుపెరుగని ఊహల వేలికొసలు
నిరంతరం కామదేనువులూ, కల్ప తరువులుగా మారి
సుతిమెత్తని అక్షరాలు పేర్చి
మాటలు కూర్చేందుకు - మనసొకటి సజీవమేగా ... !
నిలువెత్తు ఎగసి అంతలోనే నిలువునా వాలి
పరవళ్ళుతొక్కే సముద్రాలూ,
కాలానికి పరిమళ మద్ది
కనురెప్పలపై పెదవులనాంచి లాలించే సమయాలూ ,
మౌనంగా నీ రెండ కలగలిపి నేసుకున్న కలనేత స్వప్నాలూ
ఇవన్నీ క్షణక్షణం రెక్కలార్పే సరిగమలూ ,
విహ్వలత అయోమయంలో చిక్కి
నిస్సహాయత కన్నీరైనప్పుడు
తొలకరి చినుకులయే బాధా ఇవేగా
వెచ్చని ఊపిరులై భావుకత తొణికేది.
గాలి వీవన వింజామరల చల్లదనంలో హిమపుష్పాలై రాలుతున్న
ఘనీభవించిన మమతల్లో అట్టడుగు తమకాలూ
ఉదయపు మసక వెలుతురులో పారిజాతాలైన పరవశాలూ
ఇవేకదా కథాసరిత్ సాగరాలు ,
కమనీయ కావ్యాలూ
చెక్కిలిపై మువి వేళ్ళు చెక్కిన శిల్పాలూ
ముని మాపు సమయాన ఆర్తిగా వెన్ను నిమిరే ఆర్ద్రత
ఇంతకన్నా అనుబంధాలేముంటాయి?

★★★★



## నీ కోసం..
### జలసూత్రం చంద్రశేఖర్

జీవిత కళాశాలలో ఎవరినీ చూసింది లేదు
నీ కళ్ళను చూసాక నన్ను నేనే మరిచా,
గెలుపు కోసం ఎప్పుడూ ఆడింది లేదు
నీ బంగారు చేతుల సవ్వడి కోసం ప్రతి ఆటలో గెలిచా,
నువ్వు ఏనాడూ వెనుకకు తిరిగి  చూడలేదు
నిశీధి నీడలా నీ వెంటే నడిచా ,
దేవత గుడి తలుపులింకా తియ్యలేదు
మెట్లమీద పువ్వునై వేచా ,
వేరే ఎవరినో ప్రేమిస్తున్నావని తెలియలేదు
నా కలల కిటికీ తెరిచే ఉంచా ,
నువ్వు దూరమైనప్పుడు - కాలం ఆగిపోలేదు
కన్నీటి సంద్రాన్ని రెప్పల్లో  దాచా,
ప్రేమ పుస్తకంలో ఒక్క అక్షరం కూడా రాయలేదు
ఈ జన్మకు ఇంతేనని మొత్తంగా చించేసా!!!

★★★



## కిస్మత్..
### బండారి రాజకుమార్

ఎవలో ఒంట్లోని నరాల్ని పగ్గంబట్టిగుంజి
బద్దితోడి పాతరేసినట్లు
ఏరుబడితెనే ఏలుబడుంటదని
బంధాన్ని ఫుటుక్కున తెంపుకున్న ల్యాతాకు గాలిపటమైనట్లు
నడిసొచ్చినప్పుడు ఇసిరిన న్యాలసూపులు
ఎల్లెల్కల పడంగనే మొగులును  ముద్దిచ్చుకున్నట్లు
అముడాల పిల్లలు బుట్టంగనే..అద్దాలు ఎక్కిరిచ్చినట్లు
షిమ్మశీకటి చేతుల్ని బార్లాసాపి
ప్రేమగీతం పాడినట్లు
లావర్షి మాటల ముండ్లు గుచ్చుకుని
కలుక్కుమన్న బాధ సుల్కుసుల్కున పొడిషినట్లు
అన్నీ...కన్నీళ్లే !
అన్నీ...కలవరింతలే !!
దుక్కం ఎంత ఆపుదమన్న ఆగుతలేదు
ఆగిపోయిన పెండ్లికి సప్పుల్లెందుకని
ఒక్కోక్కలు సాతకింద నీళ్లలెక్క జారుకుంటాన్రు
కాల్జేతులు ఆడుతలెవ్వు
గుండెకాయ బొండిగెలకొచ్చింది
కక్కుదునా..పానంబోతది
ఏంజేయాల్నో దోత్తలేదు
మొకబిల్ల పడుదమంటె
ఎదుటోని మొఖంల  నెత్తురుసుక్క కనబడుతలేదు
గుండెదిటవు జేసుకుని
ఎట్లయితే..అట్లాయెనని
మనసు..ఒక్క షిత్తం జేసుకున్న !
ఇగ కిస్మతుంటే...
కిరాతకుడైనా ..కిట్టపరమాత్ముడైతడు  !!

★★★

## శ్రీ''వారికి

**అమూల్య**

ప్రేమను అందించటంలో మా నాన్ననే మించావు
గుండెనిండా నిండి మా అమ్మనే మరిపించావు
ఏడడుగులు వేసానని ప్రతి అడుగులో తోడై నిలిచావు...

నీ చిటికెన వేలు పట్టుకున్నానని
చంటి పాపను చేసి నీ కంటి పాపలో నింపుకున్నావు...

ఆ తారలనే తలంబ్రాలుగా జల్లి నా జీవితంలో వెలుగువై  నిండావు.

నీ సగభాగం నాకిచ్చి, నా నుదిటిన సింధూరంగా   మారావు...

అలసిన నాడు సేవకుడివై సేవించావు...
సొలసిపోయుంటే కమ్మగా నీ ఒడిలో సేదతీరమన్నావు..

అలిగి మూతిముడిస్తే పసివాడిలా మారి కవ్విం చావు
కోపంతో కస్సుమంటే నీ కౌగిలిలో

ఆ సూర్యుడితోనే జాజుల జల్లు కురిపించి
లాలించి మందలిస్తూ నన్ను పసిదానిని చేసి ఆడించి పాలించావు...

కష్టమే నను చేరినా
ఆ కష్టాన్ని సైతం ఇష్టంగా నువ్వే మోసావు...

మెట్టెలా కాలిని చుట్టుకొని
తడబడక అడుగును ముందుకు వేయించావు ...

గుండెల పై వేలాడుతూ
నా గుండె స్పందనను చెప్పకనే ఆలకించావు....

కాదంటావా ఇది నా అదృష్టం అని
మరి అవునంటాను అసలు నువ్వే నా అదృష్టమని

పంచుకుంది కాయం మాత్రమే అయితే ఇంత వెలుగు నిండదు
పంచింది నీ ప్రాణం కదూ...!

ఇచ్చింది బాధ్యతే అయితే బరువే పెరిగేది
కాని అందించింది ఇల్లాలు అంటూ నీ గుండె గృహలక్ష్మి హోదా కదూ..!.

పెంచుకుంది స్థానాలే అయ్యుంటే భారంగా నే తోచేది
కాని పూయించింది మన జీవన కొమ్మకు మల్లెలు కదూ..!!.

మరి నిజమే 'నేను' అన్నది ఎప్పుడూ అసంపూర్ణమే
నువ్వు కలిసి 'మనం' అన్నది చేరేంతవరకు....

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

గతము కొంతయె కన్నుల గట్టుచుండు
మరచిపోయిన గతమేమొ మాయమయ్యె
గుర్తు వచ్చుచునుండును కొంత వరకు
మదిని నిల్చిన గతములో మార్పు రాదు

గడచినది నాదు జీవిత కాలమొకటె
ఒక్క గతిలోన గడచెనో పెక్కు గతులొ
ఎన్నియో బాటలను పయనించి వచ్చి
మిన్నయౌ బ్రతుకును మది యెన్నుకొనెనొ!

ఎన్ని దారుల వచ్చిననేమి ఫలము?
సుంతయును లేకనన్నియు శూన్యమయ్యె
స్మృతిపథమ్మున మిగిలిన బ్రతుకదొకటె
ఇది మెరుగు బాటయో లేక హీనపథమొ!

వలయు నెచ్చెలి నా వెంట వచ్చినపుడు
కోరినవి బ్రతుకున సమకూడినపుడు
ఎపుడు మనసును వెతలు ముంచెత్తనపుడు
మెరుగు బాటయే బ్రతుకెల్ల విరుల తోట

సారెకిచ్చట సంతృప్తి దూరమైన
వేడుకొన్నది బ్రతుకున వెలితి యైన
వలయు ప్రేమాంబువులు రెండు భ్రాతియైన
ఎట్లు నిలుచునో స్మృతిని యీ హీనపథము?



చిత్రం:కె.రామ్మోహన్

# నీడల కింద

## సురేష్ రావి

నన్ను రాసుకుందామనుకున్నప్పుడల్లా
ఒక కాగితపు శూన్యం నన్ను భయపెట్టేస్తుంది
మొహమాటంగా నన్నద్దుకుంటున్న వెన్నెల వీచికలు
నా మది వాకిట్లో దాగుడుమూతలాడుతుంటే తెలిసింది
నన్ను మింగేసే గ్రహణం కోసం
అవి విసుగ్గా వేచి చూస్తున్న సంగతి

కలలుగానే నచ్చుతాయ్ కొన్ని ఆకుపచ్చతనాలు
కథలుగానే బాగుంటాయ్ కొన్ని సాహసయాత్రలు
ఎదురు చూపుల్ని పారేసుకున్నాక
వచ్చే వసంతాల కథల మీద భ్రమలుండవులే
జీవితం పదునుగా రెప్పల్ని విడదీస్తున్న చోట
అప్పుడప్పుడూ కలలు హత్య చేయబడుతూ ఉంటాయి



దేహమే సరిహద్దు అయ్యాక
కనిపించేదంతా శత్రుపక్షమై
అడుగడుగునా కందకాలు
అడుగేస్తే ముళ్ళకంచెలే గుచ్చుకుంటుంటే
ఇప్పటి వరకూ మెలకువగా ఉన్న నిద్ర ఒకటి
నెమ్మదిగా నిద్రలోకి జారుకుంది
ఒక ఖాళీతనాన్ని నిండారా పోతపోస్తూ
గాఢంగా నాలోకి మరో చీకటిని ఊపిరాదుతూ

ఇప్పుడిక దాటి రావాలి... అన్నీ దాటిరావాలి...
నాలో నన్ను గడియ విప్పేసుకుని
ఆకాశం చెప్పే రహస్యాలలో తడుస్తూ
వలయాలు వలయాలుగా వసంతాన్ని చుట్టుకుంటూ
మెత్తని వానజల్లుని మత్తుగా మనసుకద్దుకుంటూ
అప్పుడప్పుడూ నిద్రపోవాలని ఉంది
నీడల కింద
నన్ను కాపు కాయటానికే వచ్చిన నీడల కింద

★★★

## జాలిపాట

కొండముది సాయికిరణ్ కుమార్

కెరటాలై కొట్టుకుపోయిన
కొన్ని వాక్యాల వేడి స్పర్శ
మనలోనే
మరో లోకాన్ని చూపిస్తుంది.

పలుకు నాది కాదు
పాటా నాది కాదు
నీడల్లో దాగిన నా పాత్ర
నేననుకున్న నిజమూ కాదు.

జాలిగా పాడుకున్న
గాలి పాట
మైకం కమ్మిన మబ్బులా
ఆకాశం అంచున
ఊపిరి విడుస్తుంది.
అద్దంలా మెరుస్తున్న
సముద్రం
ఆకాశాన్నే మింగేస్తుంది!

★★★



# న్యూడ్ మోడల్

మూలా వీరేశ్వరరావు

ఆకలొక్కటే సత్యమై
కల లన్నీ భగ్నమై
నగ్నమై
నీ ఎదుట నిలిచాను !
ఆకలి ఆచ్ఛాదిత
వక్షో జ ద్వయం !
కాలం కదులు తుంటే
అతని కాన్వాసు పై
గీతలు గా , వ ర్ణాలు గా
మై దానాలు గా , పర్వతా గ్రాలు గా
చీలిన జలపాతాలు గా
నాలో ఆకలి వృష్టి సాగినా
అతని కుంచె నుం డి జారుతోంది
క ళాసృష్టి !
అతని ఎదురు గా నేను !
అలసినా చలించని మేను !
కుంచె అలిసాక ,ఆకలి పెరిగాక
అతను ఇచ్చిన నోటు
వేస్తుంది ఆకలి కి వేటు !
క ళ్ళు పడ కుండా
ఒళ్ళు కప్పేసుకుని
చీకటిలోకి జారిపోతాను !
కాన్వాసు నుండి అందం
అంగడి లోకి రవాణా అవుతుంది !
అతని పైకం తో ఒక
రోజుని గతం లోకి గెంటుతాను !
రేపటి సంగతి ఆకలి కే తెలుసు !
అతను మళ్ళీ పిలుస్తాడు !
అతను ;నేను
ఆకలి త్రాసుకు అటు ఇటు !
దు : ఖం ఆ కాశమై
సుఖాలు వచ్చి పోయె
మేఘా లైనప్పుడు
అనివార్య ఆకలి
వాకిలి వదలని విహంగాలం !

( న్యూ డ్ మోడల్ నేపథ్యం లో )

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇంచుకేనియు విశ్రాంతినెరుగకుండ
కనులు దించక నా మోము కాంచితీవు
వెలితి యెరుగని నిండైన ప్రేమతోడ
జీవితము హర్షమయమును చేసితీవు

ఆ దినమ్ములు నిలువక యరిగెనెటకొ
పరుగులిడుచుండెనెచటికో వత్సరములు
బ్రతికినంతటి కాలము బ్రతుకబోము
ప్రేమ యేలనో యీనాడు వెలితి యయ్యె

కలసి కాలమునిప్పుడు గడపగలము
జీవితపుటంచును కలసి చేరగలము
కాని యొకనాటి యనుభూతి కానమిపుడు
ఎచటికేగెనో యుద్వేగమెరుగలేము

అంతరంగము రసహీనమైన గాని
కలసి నాచెంత క్షణమైన నిలువ రమ్ము
ఈ విరుల దారిలో విహరింప రమ్ము
నిలచి తిలకింతుమీ వని నిముసమైన

కరగిపోయిన కాలమ్ము కనుల నిండు
మరచిపోయిన రాగమ్ము మరల కలుగు
ఎరుగదాత్మ జరత్వమ్ము మరణమైన
మరణమెరిగియు మన ప్రేమ మరల విరియు



చిత్రం:కె.రామ్మోహన్

శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది  సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

## ఇంకొంచెం ప్రేమించాల్సింది

డా. నారాయణ గరిమెళ్ళ

అమ్మ కంట పడ్డ వెన్న-దొంగ-తనం
తప్పించుకు పారిపోయాక
కోపం చల్లారిన అమ్మ
అనుకుంటుంది
' కన్నయ్యను
ఇంకొంచెం ప్రేమించాల్సింది.
మూతి నిండా పూసుకున్న
వెన్నను కడిగాక
పారిపోమని చెప్పాల్సింది '

★★★

రోజంతా ఎండన పడి
నాగలి లాగిన ఎద్దులు
రాత్రి కి కూలబడిన
ఉసూరు సమయాన
రైతు అనుకుంటాడు
' ఇంకొంచెం ప్రేమించాల్సింది
ఆరారా కుడితైనా పట్టి ఉండాల్సింది '

★★★

జీవితం పొడవునా పనిచేసిన ఇల్లాలు
అవసానదశ లో మంచం పట్టిన సమయాన
పెనిమిటి అనుకుంటాడు
' ఇంకొంచెం ప్రేమించాల్సింది

ఆమెకు అమ్మనై సాకాల్సింది `

★★★

అత్తింటి కి వెళ్ళిపోతున్న ఆడ-కూతురూ
చదువు కో మరి కొలువు కో ఎగిరిపోతున్న కొడుకూ
చుట్టం చూపుగా వచ్చి పోతున్న అమ్మానాన్నా
సదా
పదే పదే
అనిపిస్తూనే ఉంటారు
' ఇంకొంచెం ప్రేమించాల్సింది' అని

గతించిపోయిన వాళ్ళని తలచి
పొంగి పొరలిన దుఃఖమూ అంటుంది
'బతికుండగానే ఇంకొంచెం ప్రేమించాల్సింది' అని

అంతరించి పోయిన జాతులను తలచుకుని ప్రకృతీ అంటుంది
' కోల్పోక ముందే ఇంకొంచెం ప్రేమించాల్సింది' అని

ప్రేమించడం తెలిసిన హృదయమే
ఇంకా ఇవ్వాల్సిన దాని గురించి
ఇవ్వ లేకపోయానని
తల్లడిల్లుతుంది

ఐనా,
ఇంకొంచెం ఇంకొంచెం గా పెంచుతూ పోతే మాత్రం
పోయేదేముంది?

ప్రేమే కదా!

ప్రేమనే
' ఇంకొంచెం ప్రేమించాల్సింది' అనుకునే లా
లేని వాళ్లకూ ఇచ్చి
భర్తీ చేసుకోనివ్వండి.

***

# కొడుకు లేడు

పాలపర్తి ఇంద్రాణి

ఆ గుమ్మం
ముందు

మండుతోన్న
గచ్చు మీద
చేపలా
కొట్టుకులాడుతో
మనసు

గమ్యం లేని
రైలెక్కేసి
వాడు
ఖాళీ చేసి
వెళ్ళిపోయిన
ఇల్లు.

అపరిచిత మొహం
వెనక
వెల్ల వేసుకుని
మొహం మార్చుకున్న
ఇల్లు.

ఎవరు కావాలి మీకు?

వట్టిపోయిన
గిలకబావి

గొంతుక
ఊరదు
మాట

కంటి దోనెల
పొంగే నీరు
ఆనదే
చూపు

దుఃఖం
దుఃఖించలేనంత
దుఃఖం.
****

## వసంత గీతి

డా:మాదిన రామకృష్ణ

నీలో ఏదో మండుతున్న అగ్ని
అందుకే నీ చర్మం పై పొరనుంచి "చంద్ర కాంతి"
ఈ వసంత రాత్రి ఓ విషాద గీతాన్ని రాస్తున్నా
"నేను ఆమెను ప్రేమించా,అప్పుడప్పుడు
ఆమే నన్నూ ప్రేమించింది"!అని
ప్రపంచం లోని పూలన్నీ త్రుంచెయ్యగలమ్
వసంతాన్ని రాకుండా ఆపగలమా?
ఈ ఏకాంత గృహంలో ఒంటరితనం
నువ్వు వచ్చే వరకూ నాలో జీవించే వరకూ
నా కిటికీలు వేదనతో చమర్చుతాయి
నీ కోసమే పూదోటలు పుష్పిస్తాయి
పూలు,నేనూ వసంత పరిమళంలో రోదిస్తాము
నీ మోవిని మరచిపోయా

నన్ను స్పర్శించిన నీ చేతులు నాకు జ్ఞాపకం లేవు
నీకోసమే తెల్లని పాలరాతి బొమ్మల్ని కళ్ళతో తాకా
మైదానాల్లో కునుకుతూ నిలబడ్డ
ఆ శ్వేత శిలలు చూపులు లేని మూగవి
నీ గొంతునీ దాంట్లో తీయందనాన్ని
ఆ నీ కళ్ళనీ అన్నీ మరచిపోయా
మనం పూవూ దాని పరిమళం అనుకున్నా
ఏదో అస్పష్టమయిన జ్ఞాపకం
క్షుదతో వ్యధతో జీవితం
మానని గాయం వళ్ళంతా
మళ్లి జ్ఞాపకాల స్పర్శ,రగిలే మంటా
రాత్రంతా మళ్లి విషాద గీతాన్నిరాస్తున్నా
"రాత్రి నిండా నక్షత్రాలు ,తారలు
నీలివి,దూరంగా నీలానే మిణుకు మని
నేను ఆమెను ప్రేమించా
అప్పుడప్పుడూ ఆమే నన్నూ ప్రేమించింది అని"
(i want to do
what spring does with cherries )
వసంతం పూలతో ఎలా చెలిషిస్తుందో
నేనూ వసంతంలా cherish చేయాలని

****

# బిగపట్టిన దుఃఖం

జయ రెడ్డి బోడ

సమస్త జీవ రాశుల కోసం,ఇల పరచిన
ఆకు పచ్చని పానుపేమో అనిపిస్తుంది
ఆ తోటను చూస్తుంటే
తమను తాము మొదల్ల లోతుల్లోకి పాతుకొని
పైకి తలలూపుతూ లోకమంతా చల్ల దనాన్ని పరుస్తూ
విసన కర్రలైన ఆ వృక్షరాజాలు

సన సన్నని ఈల వేస్తూ చెవిని ఆనందంగా స్పృశించి
వెళుతున్న చిరుగాలి
అందమైన ఆ ఉద్యాన వనంలోని అతని దర్భల గూడు
లోకంలోని హెచ్చు తగ్గుల పట్టింపు లేనట్లు హుందాగా
అప్పుడప్పుడు తలెత్తి తన యజమానిని చూస్తూ గర్వంగా,
ధైర్యంగా పచ్చ దనాన్ని పొట్టనింపుకుంటున్న
స్వేతశ్వాల్లాంటి వృషభాలు
ప్రపంచాన్ని జయించి వచ్చిన రథం లా... సేద
దీరుతున్న ఓ "గుడిసె కచ్చురం" తోట మధ్యన
ఏ అద్భుత మెదడు ఆలోచనా స్రవంతి నుండో మొలిచినో
తేనే పలుకు పదాల అల్లికతో పుష్పించి అతని హృదయాన్ని
మధుర అనుభూతి నింపిన.. ఓ కవితా కండమో,నవలా నాయికనో
కథా కావ్యమో అతని కళ్ళచే ఆరగింపబడి మదిని పులకింప చేసి
ఆ రసాస్వాదకుని యెదపై టీవీగా' సేదతీరుతుండగా,
సృష్టి రహస్యం కనుక్కున్న దానిలా ఊహలలో ఊగిపోతూ మది
పరవశించి పోతూ కళ్ళు మూసుకుని .. జగమే ఊయల అని,
పరవశించి పోతుంటే
అప్పుడే ఎక్కడో,చిన్నగా అలికిడి పల్లే కన్నీరు పెడుతుంది కనిపించని కుట్రలా
అని ఓ పెద్దాయన రాగం నిమిష నిమిషానికి పెద్దదై చెవిలో హోరు పెడుతుంటే
మాయమై పోతున్నాడమ్మా మనిషన్నవాడు సున్నితత్వం వదిలి
కర్కషత్వాల,ద్వేష భావాల ఒడినపడి అని ఇంకేదో కంచు కంఠం...
అప్పుడే అతను పారి పోయి బాల్య స్మృతుల వదలి,ఆ పంట చేల వీడి
నలు దిక్కుల నాగరికపు యంత్ర జీవితాల వైపు ధనార్జనే ధ్యేయమై
నేనూ నా కల కరిగి బిగ పట్టిన దుఃఖంతో వాస్తవం లోకి ...
విసిరి వేయబడుతాను ... మళ్ళీ జీవం లేని ఒక దినం లోకి

****

శ్రీ దుర్ముఖి నామ సంవత్సర ఉగాది సందర్భంగా
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా వారు నిర్వహించిన
21 వ ఉగాది ఉత్తమ రచనల పోటీ లో
నా మొట్టమొదటి కవిత విభాగంలో బహుమతి పొందిన కవితలు

# ఏమిటి ఈ వెర్రి జనం

శ్రీనివాస్ రవితేజ

ఏమిటి ఈ వెర్రి జనం,
మన కలి`కులం` లోనే ఉన్నది కులం,
మనదంతా రసి`కులం`,
కాగలమా ప్రేమి`కులం`,
పేరుకే నాయ`కులం`,
వోటుబ్యాంకు పాల`కులం`,
ముందు కులం, వెనక కులం, కుడిఎడమల కులం కులం,
పైన కులం,కింద కులం నలుదిక్కుల కులం కులం ,
మనమంతా భానిసలం,
మనకంటూ లేదు బలం,
అంటాము సలాం సలాం,
చేస్తాము గులాం గులాం,
సోమరులం,పామరులం, వానరులం,
మనమంతా స్కీమరులం ,డ్రామరులం,
ఉత్తి వెధవలం,
వెర్రి వెధవలం ....

మనలోనే పదిలం ఈ కులం,
మనతోనే శిథిలం ఈ కులం...

ఆవేదనతో కదిలింది నా `కలం` !!

★★★★

# ఊహల్లో ఉగాది

రాధ అనుపూరు

ఉదయ కిరణాలతో ఊగిసలాడుతూ
వయ్యారంగా నడిచి వస్తున్న ఉగాది భామ,
ఆ భావనే, నన్ను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నా
ఇంటింటా ముగ్గుల కొలువు చూస్తామనే ఆశతో
గుమ్మం ముందే స్తబ్దంగా నిలిచిపోయింది నా చూపు!
వాస్తవం మేలుకొలుపుతో, సంకెళ్ళు వేసింది నా ఆలోచనలకి,
ఉన్నది విదేశం, తెలుగు దేశం కాదని విన్నవించుకుంటూ,
ఓ నిట్టూర్పుతో తలపులు సముద్రాలు దాటి
గతనాటి ఉగాది వేడుకలు అందుకోవాలనే తపనతో
పయనమైపోయింది నా మనసు..!!
సూర్యకిరణాల వెలుగులో మెరిసిపోతూ పరుగులు తీస్తున్న
పవిత్ర నదులు తీరం చేరుకోవాలని,
గలగలమనే చెలరేగె వింత వింత ధ్వనులతో
ఉగాది వస్తుందనే సందడి  సరికొత్త సంవత్సరానికి నాంది అంటూ
ఉగాది లక్ష్మికి స్వాగతం చెప్పాలనే  తెలుగింటి ఆడపడుచు పడే అగచాట్లు!
ఆకుపచ్చని తోరణాలు చిరుగాలిలో సోయగాలాడుతూ,
ధూప దీప నైవేద్యాలతో నాంది పలుకమని
పూజా పీటికపై ఆవాహమైన వినాయకునికి విన్నవిస్తూ
జీవితమే ఓ ఉగాది పచ్చడిలా  సరిదిద్దమని ప్రార్థిస్తూ
లాభ, నష్టాల పంచాంగపు చార్టులో లెక్కబెడుతున్న శాస్త్రులు
కుటుంబ సభ్యుల హాస్యాలతో తికమకపడుతున్న ఆచార్యులు
తలచుకుంటేనే, మరువలేని కొడాక్ క్షణం
పెదవుల మధ్య చిరుహాసం తొంగి చూచె
మరుపరాని ఆ రోజులు మరి మరి రావేమోనని
అలసిపోయె  నా మనసు!
గత ఊహల తెరల నుండి తప్పుకుంటూ
"దుర్ముఖి" నామ సంవత్సరానికి ఆరతి పాడుతూ
ప్రకృతి లాగ పరిమళించమని ఆశయంతో
ఉగాది శుభాకాంక్షలు అందుకోమని
విన్నవించుకుంటూ ఓ తెలుగింటి బిడ్డ
సాగిపోయింది తన విదేశి జీవిత సాగరంలోకి ★★★

# నిశ్శబ్ద గాయం

ఉమా నూతక్కి

**నేనొక నిశ్శబ్ద యుద్ధరంగాన్ని**
పెనుగాయాలతో విరిగిపడ్డ కలల క్షేత్రాన్ని
మౌన మహార్ణావంలో కన్నీటి అలలుగా
కొట్టుకులాడుతున్న పంజరపు స్వేచ్ఛని

యుగాల సరిహద్దు రేఖల ఆంక్షల్లో
పుడమి గర్భంలోనో, గండుశిలలానో తలదాచుకున్న శీలపరీక్షని
కావ్యాల సౌందర్యానికి అలంకారాన్ని
ఇంతవరకెక్కడా నాకు నేనుగా రాయబడని అక్షరాన్ని

కాలపు వేదనా వలయాల తొలి సాక్ష్యాన్ని
చీకటి గొంతుకలో కొట్టుకులాడుతున్న ఆర్త గీతాన్ని
అంతరంగపు ఒంటి స్థంభంలో
చీకటి శబ్దాన్ని అవలోకిస్తున్న తడి చారికని

సహన శాస్త్రాలు అంటగట్టబడ్డ ఆర్ద్ర స్వరాన్ని
మనసాంతక క్షణాల శరాలని తాళలేక
యుగాంతపు పిలుపుకోసం ప్రళయవేదాన్ని
ప్రణవంగా జపిస్తున్న అంతేవాసిని



సీత... అహల్య... ఊర్మిళ... మండోదరి
ద్రౌపది... రుక్మిణి... కుంతి... గాంధారి
కవిత... మహిత... రాధిక... రేణుక
పేరేదైతేనేం !
ధరిత్రి నిండా నా సరిహద్దు ఆడపిల్ల గానే
కాలం అంచుల వరకూ కొనసాగే యుద్ధ గాయాన్నే

***

# చెత్త బతుకు

కృష్ణ మణి

**చేతిలో మొల గుచ్చిన కట్టే**
సంకకు సంచి తెగిన చెప్పులు !
తెల్లారింది మాకు
చెత్తను ఏరి
మా బతుకులను నింపడానికి !
పెంటకుప్పలే భోజనశాల
ఆకలికి అక్కడే ఓదార్పు
పాచిన వంటలు
ముగిగిన పళ్ళు
కుక్కల పందుల పోటి పరుగు !
ఇనుము ప్లాస్టికు కాగితాలు
ఇవే కదా ఆధారం
ఇదే మా జీవితం !!
విసిరిన వస్తువు
కంటికి ములిపెం
మంచివి చెడ్డవి అన్నీ మావే
బరువు పెంచుతూ
ఆశలు అల్లుతూ
రేపటి రోజుకు చెదరని చూపు !
తరగని చెత్త
నోయ్యని కాలు
పగలు దాటితే
సాగని నడకలు
చేరని తీరం
దించిన మూటలు
అమ్మిన కష్టం
అందిన సొమ్ముతో
అందని వెలుగు

బతుకు పోరులో నిత్యం వేటగాల్లం
చావని ఆశతో మసలే ముల్లుజల్లెలం !

★★★

# నీ చూపులో

లలిత చిట్టే

వెచ్చని నీ చూపు
వెలుగు కిరణమై .. నను తాకగా.
క్రమ్ముకున్న చీకటి కంగారు పడి
దూరంగా పారిపోయింది!
అలముకున్న నైరాశ్యం నిట్టూర్చుతూ..
ప్రక్కకి జారుకుంది.
వెల్లువైన సంతోషం మదినిండి
సందడి చేసింది!
యవ్వనం మధ్యాహ్నమై..
స్థంభించిన కాలం ఉత్సాహంగా..
ముందుకు కదిలింది.
సంద్రంలాంటి నిను చేరడానికి.
జీవితమొక ప్రవాహమై పొంగి పొరలుతోంది!
అస్తమించినవేళ.. ఆశలు ఉదయిస్తున్నాయి.
మోడైన కొమ్మనుండి
కోరికలు చివురులు వేస్తున్నాయి.
మాటలు మరిచిన పెదవులు
రాగాలను ఆలపిస్తున్నాయి
నీ రాకతో
ముంగిట వసంతం వెల్లివిరిసింది.
హృదయం పూలవనమై విరబూసింది!!

★★★★

## మీ అందరికీ తెలిసిన ... కొనకంచి లక్ష్మీనరసింహారావు

యుగాలాదిగా ఉన్న
ప్రేమ రాహిత్య స్థితిలో
కడుపునిండని వికృతత్వ ఆకలితో
నిర్భాగ్య దీనంగా బ్రతుకుతూ చచ్చిపోతావా?

విషం కలిపిన జిలేబీని
ప్రేమ కానుకగా ఇస్తాను.
నోరు తీపితో కడుపునిండా తిని
సంతృప్తితో చచ్చిపోతావా?

ప్రేమించటమంటే
మనిషి అర్థం కాని అరణ్యంలో..
వర్షంగా కురవటం...
ఎవరూ చూడకుండా దుఃఖంలో..కూలటం

ప్రేమించటమంటే
నిర్వచించలేని.. నిబంధన లేవీలేని
అంతుతెలీని ప్రవహంలోకి ..
కాళ్ళు చేతులు కట్టేసుకోని దూకటం..

ప్రేమించటమంటే
యెవరికి వాళ్ళు తయారు చేసుకున్న
విషాన్ని తనివితీరా తాగి..
చావో బ్రతుకో తెలీని నిప్పుల్లో దూకటం..

విధ్వంసమయిన క్షణాలల్లో
అప్రకటితమయిన యుద్ధంలో
అవయవాలన్నీ కోల్పోయాక
దేహానికి వాయుగుండాలే అలవాటయిపోయాక
అల్పపీడనాలే జీవిత సూత్రాలుగా మిగిలిపోయాక
దుఃఖాలని కొలవటానికి ఈ ప్రపంచంకోసం
నేను కొత్త కొలమానాలని వ్రాస్తున్నాను!!

నాది ఇప్పుడు అంతా..
సరికొత్త ...వ్యాకరణం.
నాది ఇప్పుడు అంతా..
సరికొత్త భాషా సంభాషణం

అందుకే ..నా తోటలో ఉన్న
పాత చెట్లన్నీ కొత్త పూలు పూస్తున్నాయి

2

తెగిపోయిన పూలదండలో
దాగున్న దారం
తన ఒంటి నిండా ఉన్న
ఉచ్చులని చూసుకుంటూ
వచ్చింది స్వేచ్ఛ..చచ్చింది స్వేచ్ఛ అనే
దిక్కుతోచని అంతిమ స్థితిలో
శరీరమంతా గాయాలతో...వయికల్యాలతో
కాలగర్భంలో ..దిక్కులేకుండా చచ్చిపోతుంది

మనుషులూ అంతే ..
కొంతమంది ..దారాలు..
కొంతమంది..పూవులు..
కొంతమంది..నడిచేదారుల్లో
గుచ్చుకునే పల్లేరు ముళ్ళు

మీఅందరికీ తెలిసిన
భయవిహ్వల దుఃఖంలో
బయట కాలిపోతూ..ఎన్నో ఆత్మవంచనలతో
మిమ్మల్ని మీరే ఆనందీకరించుకొని
మిమ్మల్ని మీరే క్రమబద్ధీకరించుకొని

మీకు తెలియకుండానే ..మీరు ..
దోసిళ్ళతో అగ్ని సముద్రాలని
కాచి వడపోస్తున్నప్పుడు...

ప్రేమకూడా అందరికీ తెలిసిన ఓ బహిరంగ అబద్ధమే
ప్రేమకూడా అందరికీ తెలిసిన ఓ చందమామకథే
ప్రేమకూడా అందరికీ తెలిసిన ఓ ఎండమావే

3

కంటి ముందు నడుస్తున్న ఘడియలన్నీ
నిరీక్షణతోనే ..నిర్లిప్తంగా గడిచిపోతున్నప్పుడు
సూర్యోదయాలెన్నో కళ్ళముందే కొవ్వొత్తుల్లా కాలిపోతాయి.
చ్నంద్రోదయాలెన్నో కళ్ళముందే భగ్న స్వప్నాలుగా
మాలిపోతాయి.

ఇంద్రధనుస్సులో లేని నల్ల రంగు
ఎవ్వరికీ తెలీని కొత్త పక్షి గా మారి వచ్చి
నీ భుజం మీద వాలుతుంది.
నీకు తెలీని కొత్త పాట గా..
నీకు తెలీని కొత్త మాటగా..మారుతుంది
నీకు తెలీని కొత్త అక్షరం గా రూపాంతరమయ్యి
నిన్ను నువ్వెప్పుడూ చూడని ఓ కొత్త భాషగా
ఆవిష్కరిస్తుంది.

ఒళ్ళంతా ఎప్పుడూ చూడని
కాంక్షలీనే దివ్య పరిమళాలు రక్తం నిండా
పరుగులిడుతుంటే
కనుచూపుమేర కనిపించే ద్రుశ్యాలన్నీ
వందల స్వర్గ ద్వారాలుగా మిగిలిపోతాయి.

ప్రేమ ఓ కత్తుల విహంగమై..
నీ మనస్సునే ఓ ఉద్యానవనం గా మార్చి
నీకు తెలీకుండానే నీలోపలే గూడు కట్టుకుంటుంది.
దానికి ..ఆహారం నువ్వే..
నీ రక్తంలోనే ..నీలోనే..నీకు తెలిసేలా ..
ద్విదళ..త్రిదళాల..పద్మాలను పూయిస్తుంది

4

నువ్వు కావాలని తెలిచి
సుందర ద్రుశ్యం కోసం చూస్తున్న నీ మనో గవాక్షం
నువ్వు ప్రేమలో పడకపోతే
నీ జీవిత కాలం ఎప్పుడూ తెరుచుకోదు.

నీ మనస్సులో దాగున్న మత్తుపదార్థంలో మత్తెంతో
నువ్వు ప్రేమలో పడితేనే ప్రపంచానికి తెలుస్తుంది.

ఆరు బయట అసందర్భ అసంపూర్ణంగా
నువ్వు నిలబడ్డప్పుడు..నిన్ను నువ్వు..
భ్రమగా..చూసుకున్నప్పుడు ..
మేల్కొలుపులో నువ్వు చూసే కొత్త కలే ..ప్రేమ

పడుకున్న పచ్చిక మొత్తం నిప్పుల నావగా మారినప్పుడు
అరిచేతిలో దూకుతున్న ఓ రాక్షస జలపాతంలో
తడిసిపోయి
చూస్తున్న అఖండ సముద్రంలో మునిగిపోయినప్పుడే..
ప్రేమ అంటే..ఏంటో తెలుస్తుంది.
మనిషిలో ఉన్న స్రుజనాత్మకత ఎంతో
మనిషి ప్రేమలో పడితేనే ప్రపంచానికి తెలుస్తుంది.
వసంతం శరీరంలోకి ప్రవేశించినప్పుడు
నరాల్లో వరద గోదావరి పోటెత్తినప్పుడు మాత్రమే
ప్రేమ అంటే మనిషికి తెలుస్తుంది.

5

మనిషంటే అర్థరాత్రి... చీకటి..
మనిషంటే పట్టపగలు.. వెలుతురు..
వెలుతురు..చీకటి..రెండూ..
మనిషిలోనే...మనిషికి తెలియకుండా దాక్కొని
ఉంటాయి.
స్వర్గం ..నరకం..రెండూ..
మనిషిలోనే...మనిషికి తెలియకుండా దాక్కొని
ఉంటాయి.

వెలుతురు.. చీకటి.. మధ్య
స్వర్గం.. నరకం.. మధ్య
స్వాప్నిక ప్రపంచం లా కనపడే ..వాస్తవ ప్రపంచంలో
ప్రేమికులకు మాత్రమే అర్థమయ్యే జీవిత
కవిత్వమే""ప్రేమ""
(త్వరలో విడుదల కానున్న కవితా సంపుటి
' నేనేమీ మాట్లాడను..' నుంచి)

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

జీవితమ్మున కాదిది చివరి మెట్టు
ప్రథమ సోపానమిది క్రొత్త పయనమునకు
గడచిపోయిన కాలము గడచిపోయె
ఎన్ని యుత్తేజఘడియలింకెదురు పడునొ!

పెక్కు వైరాగ్యమును తెచ్చిపెట్టుకొనుచు
ఇంకనేమున్నదిది చరమాంకమనుచు
చింతలో మ్రగ్గి మిగిలిన జీవితమును
జీవరహితమ్ము గావింప శ్రేయమేమి?

నిమిషమానందమెరుగక నిష్ఫలముగ
బ్రతుకవచ్చును బహుశతవత్సరములు
దీర్ఘగతమున కానని దివ్యపథము
హ్రస్వ జీవితమ్మున మనమందవచ్చు

ఘడియలైన మిగిలినవి క్షణములైన
వత్సరములైన మరి దశాబ్దమ్ములైన
ఎంత విలువైన కాలమో యెరుగలేము
కష్టమని తోచునెన్ని సుఖమ్ములైన

చరమ కాలము కాదిది శైశవమ్ము
తలుపు తట్టినదానంద జలధి యంచు
విశ్వసించిన మనసెల్ల ప్రేమమయము
నమ్మినంతనె జన్మమానందమయము



చిత్రం:కె.రామ్మోహన్

# అక్షరం

వసుధ కోడూరు

జ్ఞాపకాల గతంనుంచి
భవిష్యత్తు ఊహల్లోంచి
ప్రతినిమిషపు పోరాటంనుంచి
గుండెల్లోతుల్లోంచి.. వచ్చే అక్షరం ఎంత అద్భుతం!
నిశబ్ధం చెప్పే కబుర్లు
ఒంటరితనం పాడే పాట
చీకటి కనే కల
చూపుకందని భావం- చెప్పే అక్షరం ఎంత అద్భుతం!
మౌనంలో దాగిన ఆవేదన
కన్నీటితో సరిపెట్టుకున్న అవమానం
పరధ్యానంతో గడుపుతున్న జీవితం
అన్నింటా నా వెన్నంటేవున్న నా నేస్తం- అక్షరం ఎంత అద్భుతం!
వచ్చి, మీద పడిపోతున్న వయస్సును
పరిగెడుతున్న కాలాన్ని, తోసిపుచ్చి
గతానికి రెక్కలుకట్టి రేపటి ఊహలో ఎగరవేసే
వెయ్యేళ్ళ నవయవ్వనపు అక్షరం ఎంత అద్భుతం!
అందమైన తెల్లని మనస్సు
నల్లని ఏకాంతంలో కనే
రంగులకల అక్షరం!
ఎంత అద్భుతం!!!

***



# నాలుగక్షరాల మధ్య... గౌతమి

వాళ్ళ పనులన్నీ అయ్యాక పలుకరిస్తారు నన్ను
ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తాను నేను
తలుపులు తెరచి మెట్ల మీద కూర్చున్న ప్రతిసారీ
ఎందుకింత ఆలస్యం చేశావనుకుంటాను
నీకలా అనిపించదని తెలిసే సరికి చాల ఆలస్యం అయింది!

నాకేం కావాలి.... నేను తెలిసి...
నా మనసు లోకి తొంగి చూసి
కళ్ళలో వెదకి ....అపుడే పూసిన గులాబీ మొగ్గలా
సున్నితంగా నన్ను హత్తుకునే ...
నీ రెండు చేతులు...!

కళ్ళ వెంట కారే నీటిని
గరిక మీద మంచు బిందువులా తాకే
నీ వేలి కొసలు!
కానీ... నువ్వు కూడా...
నీ పనులన్నీ అయ్యాక పలుకరిస్తావు నన్ను
ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తాను నేను

★ ★ ★

వ్రాసుకుంటుంటే తల్లోనుండి జారి పడిన మల్లె మొగ్గ
అక్షరాలని ఆపేసి ఏదో చెప్పాలనుకుంటోంది-
ఇంకా వాడలేదనో
తన గురించేమీ చెప్పలేదనో,
ఒక మాలలో ఒదిగిపోయి ఉండలేక
ఇష్టంగా కట్టుబడి ఇమడలేక
విడిపోయి.. .. పడిపోయి
అక్షరాల మధ్య ఎటెళ్ళాలో వెతుక్కుంటూ
నా కన్నీటి దుప్పటి కప్పుకుంటూ.
నన్ను దాటుకుని ...నడిచెళ్ళి పోయింది
నను వెక్కిరించింది
నాకేదో స్ఫురింపజేస్తూ!

***

## వారసుడు
## ఆశోక్ అవారి

వీడూ దుశ్శాసనుడి వారసుడే..!
వీడి దేహంలో
దుశ్శాసనుడి వారసత్వపు
అపస్రవాలు నరనరాన
ఇంకుడు గుంతలా ఇంకి ఉంటాయి.!
మస్తిష్కంలోనేమో..
మాయా రావణుడి నీచత్వపు
ఆలోచనా ద్రవాల ఊటలు
ఉప్పెనలా పైపైకి ఎగిసి పడుతుంటాయి.!!
వీడి విధ్వంసపు చూపుల లేజర్ కిరణాలు
ఎన్ని స్త్రీ దేహాలను నడిబజార్లో
మానసిక వివస్త్రను చేసి
నగ్నంగా అటూ ఇటూ దూరి ఉంటాయో..?
మదమెక్కిన వీడి నీలి మాటలు
ఎన్ని కౌమార హృదయాలకు
రక్తం చిందని గాయాలు చేసి ఉంటాయో..?
పది నిమిషాల కామాగ్ని
నరనరాల్లో కాలుతుంటే
పది తలల రావణుడిలా
ఎంత మంది అమాయకపు సీతల
మానాభిమానాలు నీలి క్రీడలో హరించి వుంటాడో ?
పాలబుగ్గల పసిపిల్లల్లో సైతం
ప్రాకృతిక లిప్సా పరమ రహస్యాలను
అడవి మృగంలా జుర్రుకునే
వీడూ పదితలల మాయా రావణుడే.!!
ముమ్మాటికీ దుశ్శాసనుడికి వారసుడే.
వీడ్ని మారేదాకా..మరణించేదాకా..
విలువలతాడుకు ఉరి తీయాల్సిందే..!

***

## సానుకూలం
## పిళ్ళా కుమారస్వామి

హృదయాలు ఆనందస్వరం ఆలపిస్తాయి
నవ్వుల పువ్వుల్ని రువ్వినప్పుడు ,
ఉద్విగ్న క్షణాలు ఆవిరై
ముసురు కున్న గాఢతరంగం తేలికై ఎటో వెళ్ళిపోతుంది !
ఆనందపు పారిజాత పరిమళాలను
మానసిక ఆరోగ్య పోషకాలను
నవ్వులు నిరంతరం మోసుకొస్తాయి!
నిత్యం ఉదయించే ఉషోదయపు కాంతుల్లాగా
నవ్వు క్షణ క్షణం గుండె నిండా ప్రవహించాలి !
విషాదం జీవితాన్ని కమ్మినపుడు
పసిపిల్లల నవ్వుల్ని చూడాలి,
చిగురించే లేలేత ఆకుల పచ్చదనం చూడాలి,
ఉల్లాసం విశ్వాసాన్ని మోసులెత్తిస్తుంది!
సంతోషం ప్రపంచాన్ని జయించేందుకు అపారశక్తినిస్తుంది!!

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

రాత్రి సడి చేయుచుండె వర్షమ్ము బయట
కొలది కొలదిగ కాసేపు కురియుచుండు
కురియు కుండపోతగ మరికొంతసేపు
వదలదొకపరి రేయినీ వాన నేడు

ఒంటరిగనెవ్వరో యేడ్చుచున్న యట్లు
ఊరి వారలెవ్వరొ నవ్వుచున్నయట్లు
భీతితో కొట్టుకొను గుండె వేగమట్లు
నిముసమాగని రొద నన్ను నిదుర లేపె

జగతి యెల్లను నిదురలో జారు వేళ
ఎదలు యోచనలెల్ల స్తంభించు వేళ
ఏల యేతెంచెనీ చుట్టమీ నిశీథి?
తలుపు తట్టినదేమాట తెలుపు కొరకు?

ఎన్ని మార్లొ వడిగ పరుగెత్తి పోతి
కోలుపోయితి వేగమ్ము కొన్ని మార్లు
వాన వెలిసియు తిరిగి తా వచ్చినట్లు
ఆగుచుందును ముందుకు సాగుచుందు

నేనెరుంగుదు వర్షమా నీ యెడంద
నీవు చేసెడు సడులెల్ల నావి కావె!
నీదు ఘోషయు నీ చింత నీదు పాట
భాగమైనవే యన్ని నా బ్రతుకునందు



చిత్రం:కె.రామ్మోహన్

## నాలో నేను - నీలో నేను

డా. జి. వసుంధర

నాలో నీవున్నావు నేస్తం..!
నీలో నన్ను వెతుక్కోవాలి!!
నేను `అద్దం` కాదల్చుకోలేదు,
నిన్ను నీకు చూపించడం నా అభిమతం కాదు కాబట్టి...
పారదర్శకంగా వున్నాను,
నీవు నన్ను చూడడానికి!
కానీ
నీవు నిన్నూ చూడదల్చుకోలేదు.. నన్నూ చూడలేదు..
అందుకే `మనం` అన్న పదం నీనుండి రాదు.!
ఇది నిజంగా సమస్యేనా?
నీ విశ్లేషణకు సమస్య లేదు, కాదు!
నీవు  నన్ను గుర్తించట్లేదని నేను గుర్తిస్తున్నానే మరీ!?
పరిష్కారం!?
నీలో నన్ను వెతుక్కోకుండా
నేను  `నేను ` గానే ఉండడం..
అందుకే అంటారు -
`ప్రేమ ` అంటే `ఇవ్వడం` అని, `ఆశించడం` కాదని!
అప్పుడు
`ప్రేమ ` ఒక్కటే చాలు నీలో నన్ను చూసుకోవటానికి.!!

***



# అమ్మా నాన్న

శ్రీఆచాళ్ళ

జగమంతా వెలుగుని పంచే సూర్యుని జీవం నీవమ్మా
మా రాముడి మారాం పెంచిన జాబిలి చలవే నీదమ్మా
నీ ఒడిలోనే ఊయలలూగెను ఈ బాల్యం
నీ జోలలలో దీవెనలే కద మా భాగ్యం
కనిపించు దైవమే కనిపెంచు అమ్మగా
శిరసొంచి మొక్కుదాం ప్రతి అమ్మ బ్రహ్మగా ....
చరణం 1
చిన్నిచిన్ని మా అల్లరి పనులకి కసురుకునే అమ్మ
చిన్నికృష్ణుడే తనకు పిల్లడని మురిసిపోవునమ్మా
ప్రాణధారనే పాలగ పంచి బ్రతుకునిచ్చెనమ్మ
అమ్మ ఋణాన్ని తీర్చడానికి చాలదు ఏ జన్మ ...
కనిపించు దైవమే కనిపెంచు అమ్మగా
శిరసొంచి మొక్కుదాం ప్రతి అమ్మ బ్రహ్మగా ....
పల్లవి 2 :
మదినిండా నిధులే నిండిన సాగర హృదయం మా నాన్న
ప్రతి కలనీ ఒడ్డెక్కించే వడిగల అల ఒడి మా నాన్న
నీ సాయంతో నడకలు నేర్చెను ఈ బుడత
నీ ధైర్యంతో జగతిని గెలిచే మా భవిత
నడయాడు దైవమే నడిపించు నాన్నగా
మనసార మొక్కుదాం శిరసొంచి ప్రేమగా
చరణం 2
` కన్నా ! నీకన్నా ఎవ్వరు లోకంలో మిన్న ` అని
వెన్నుతట్టడా ఓటమి అంచున నేనుంటే నాన్న
ముందొక లక్ష్యం వెంటే విజయం ఈ జీవన పయనం
నాన్న స్ఫూర్తిగా సాగే పయనం అడుగడుగున ధన్యం
నడయాడు దైవమే నడిపించు నాన్నగా
మనసార మొక్కుదాం శిరసొంచి ప్రేమగా

★★★★

# నాలో కురిసిన కౌముది

లక్ష్మీ రాధిక

నీలో వానై కురిసిన కవిత్వమే
నాలో వెన్నెలై విరిసింది విచిత్రంగా
చడీ చప్పుడూ లేకుండా..
ప్రవహించే చుక్కలపూల ఆకాశం నుండీ
వేల అనుభూతులు నాకోసమే జార్చినట్లు..
నేనే ఒక వెన్నెలై అలలారుతాను
వాడిపోయిన కేసరాలు వెన్నెలకు చిగురించినట్లు
నిస్తేజమైన నా మది మేల్కొంటుంది
పూలపుప్పొడిపై పొంగిన తేనె తరంగమైనట్టు
కురుసిన వెన్నెల్లో నా మేనూ..నా భావమూ తడిచి
మరో రసానుభూతికి ఆయత్తమవుతాము
నిజం..
చంద్రకాంత శిల వంటి నన్ను కరిగిస్తున్న వెన్నెల
మంచిగంధమై నా చుట్టూ పరిమళిస్తూ
అలౌకికమైన కవిత్వమై నన్ను ప్రేరేపిస్తుంది
దిగులు మేఘాలంటిన వేదనలన్నీ
అవ్యక్తమనే ఆలోచనకు తావివ్వక
అక్షరమనే ఆలంబనతో..మరో విషాదానికి చరమగీతమై
ఆనందానికి ప్రాణం పోయమంది..!!

★★★

# ఓ 'కడుపు ' మంట

ఉమ

నీ హోదా ఏదైనా, నీకెన్ని కార్లున్న,
నా బాధ నాదేగా, నాకెర్రబస్సేగా,
నాన్న లేరన్న మాటెరుగవేమిరా
నేను ఒంటరినన్న ధ్యాసెక్కడుందిరా

నీకెన్ని కోట్లున్న, నువ్వెంత గొప్పైన,
నాపాట్లు నావేగ, ఆ పాత కొంపేగ
కొంగెప్పుడొదిలేవు, నన్నెంత వెతికేవు
పొంగెక్కువైపోయి గతమెంత మరిచేవు

ఆలి ఆలంటూ ఇది ఏమి గోలరా
తల్లనే మాటనే ఎమార్చినావురా
ఇది ఏమి మత్తురా, మందైన చిత్తురా
అది పొత్తు (అల్లించె ) కాదురా, నువ్వొట్టి తొత్తురా

నా కడుపుకోసుకుని నిను పుట్టనిచ్చాను,
నా నడుము వంగగా నను బయటకీడ్చావు
పొద్దుతిరుగుడు పువ్వు రవి వెంట పడినట్టు
బుద్ధి కొరవడి నువ్వు భార్యెంట పడ్డావు

ఇన్ని చెప్పిన 'బ్రహ్మం' ఇది ఎలా మరచితిరి
ఎంత కాదనుకున్న, ఆయనా ఒక 'పోతు'లూరి
ఆనాడే తెలుసుంటే నిన్నెవరు కందును
మీ నాన్ననొప్పించి దూరంగ ఉందును

ఆడదాన్నైఉండి కొడుకునే కోరాను
నాపాడు బుద్ధికి శిక్షనుభవించాను
కూతురే కోరుంటే ఆనాడు నేను
రాణిలా తిరిగేను నీ అత్తలాను

రక్తపు రంగును మార్చి నీ'పాల'బడితిని
ఆ రక్తమే ఇంకగ నే పాలిపోతిని
పక్కింటి పిన్నెన అక్కరకు ఒస్తినె
నా కంటి పాపవై దిక్కులను పడితివే

ఆనాడు నా అత్త నా నడ్డి వంచింది
ఈనాడు నీ ఆలి నన్నిసిరికొట్టింది
రెంటికీ చెడ్డ రేవడైనా బతుకు
కాటికే తప్ప ఏదినా దిక్కు

పగలంతా ఎండ ఛండ ప్రచండం
రాత్రైతే ఒంటరిగా భయం భయం
ఏ రోగంలేకున్నా, చావుకై చూడడం
ఇది ఏమి భారం, ఇంకెంత కాలం

నీ బిడ్డ 'మొల'కడగ దాసిగా సరిపోన,
మీ కడ్డులేకుండా ఓమూల కూర్చోన,
మీ ముద్దు మురిపాలు నా కడుపు నింపవా,
నన్నెందుకొంటరిగా విసిరేసినావు
ఇది ఏమి ఖర్మరా, ఇంత దుర్మార్గమా

నీ సొమ్ముతినగనో నీ సేవ కోరవడో నే తలవలేదు
మీ నలుగురుఉండంగా నా ప్రేమ పంచంగ
ఆ జ్ఞాపకంలో నే మునిగిపోని
ఆ సంబరంలో నే రాలిపోని,
మీ నాన్న చెంతకే నే చేరిపోని

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

వెడలిపోయితివపుడు నన్విడచి నీవు
తిరిగి వచ్చెదనంచును తెలిపినావు
వచ్చినప్పుడు లేను నా వసతి యందు
వెదకికొనుచును నిన్ను జీవితము గడచె

ఎన్ని నాళ్ళిక యుందునో యెరుగలేను
తిరిగి నిను చూతునో లేనో తెలియలేను
విశ్రమింపకనెల్లెడ వెదకుచుందు
అసువులను పట్టి యాపునదాశ యొకటె

ఏవియో బంధములు బ్రతుకెల్ల నిండె
జీవితపు చరమాంకమ్ము చేరువయ్యె
గతపు చిహ్నముల్ క్రమముగా కరగుచుండె
ఈ దశను గూడ మరువ నిన్నెందువలనో!

ఏవి నిలుచును స్మృతిలోననేవి యరుగు
వత్తురెవ్వరు నాతోడ బ్రతుకు దాటి
రాలిపోయిన పూలెన్నొ గాలికెగురు
నిలచి నా మది నిండెడు నేస్తమీవు

కనులకానెడు బ్రతుకును కాంచగలము
కనులకానని వేరు లోకమ్ము కలదు
కలియనైతిమీ జీవితకాలమందు
జీవితమ్మునకావల చేరనగును



చిత్రం:కె.రామ్మోహన్

# మనసు అద్దం

సుపర్ణ మహి

**...ఎవ్వరూ ఎప్పటికీ ఉండరనేసి,**
మసిపూసుకున్న మనసు అద్దం మీద
లేని నవ్వొకటి నెలవంకలా దిద్దుకుని మురిసిపోకు..

నిన్ను నువ్వే కరిగించేసుకుని
'నిన్న మొత్తం మరిచిపోయి ' వర్తమానం ఉగ్గుపాలు తాగుతూ
నేనో 'విశ్వ విజేతనని' నిన్ను నువ్వే ఓదార్చుకుని
'కలతనిద్ర'కి కబుర్లు చెప్పుకుంటూ విశ్రమించు...

తలుపుల్లేని గుహలాంటి జ్ఞాపకాల్ని దాటుకొచ్చానని
నువ్ నవ్వుతూ సంబరపడతావేమో
భ్రమల్లాంటి అనుభూతులేగా అన్నీ...

ఓ అద్భుతం చూసి కాలం ఆగిందీ లేదూ...
ఓ గాయాన్ని చూసి కరిగి కరుణించిందీ లేదూ...
రెక్కల్లాంటి ఆశేదో ఆసరాగా అనిపిస్తున్నంతసేపూ
ముళ్ళకంపతో అల్లుకున్నగూడూ అందమైన 'పొదరిల్లే..కదా..'...

.!!

***



# మౌన శబ్దం

శిష్ట్లా.వి.ఎల్.ఎస్.శర్మ

**మౌన శబ్దం**

మౌనంలో శబ్దం
శ్వాసిస్తుంది!
శబ్ద శ్వాసకు
బీజం మౌనం,
మౌన మేఘం
శబ్దమై మెరిసి ఉరిమి
చినుకై రాలుతుంది,
రాలిన చినుకు
ముత్యపు చిప్పలో శబ్దించి
శబ్దమౌక్తిక మౌతుంది!
మౌనమంటే
శబ్దీకరించక పోవటం కాదు,
శబ్దాభివ్యక్తి లేకపోవటం!
మౌనానికి చేతన వుంది
చైతన్యం వుంది
భాష వుంది
భావం వుంది
నిజానికి మౌనంకూడా అభివ్యక్తమే!
శబ్ద రూపం దొల్చని
నిశ్శబ్ద రాగాలు
నీలో లయలౌతాయి
అలలౌతాయి
సెలయేళ్ళవుతాయి
సముద్రాలౌతాయి!
మౌనముద్ర లోని శబ్దం
ఆర్ద్రమై వర్షిస్తుంది
అర్థమై శబ్దిస్తుంది!

★★★★

# కలల వంతెన

మూలా వీరేశ్వరరావు

**రాత్రంతా కలల వంతెన**
మీద నడిచి సూరీడుని కౌగలించుకుంటాను !
సూర్యుణ్ణి ము ద్దాడ లేని
అలలు " విఫలలు "
నేను నీకు అ ర్ధం కాను
కవి త్వాన్ని ప్రే మించాను కదా !
ఎదురుగా ఆమె
తలుపులు మూసింది !
తలపుల్లో నగ్నంగా
ప్రవహిస్తోంది !
ప్రేమ  ద్వే షం శాంతి యుద్ధం
ద్వంద్వాలై దాడి చేసినా
నేను  ఒక ప్రాచీన దుఃఖ ప్రవాహం లోకి

కాళ్ళు తెగిన చంద్రుడు
నా కాళ్ళ దగ్గరే !
నక్షత్రాల అలౌకిక రోదన !
చానల్ చూస్తె " అద్వైతం"
కాంక్షా కీలల స్ని గ్ధ ము గ్ద ను
చూస్తే ద్వైతమే ముద్దు !
పైకం మైకం లో నువ్వు
రోజంతా వనం లో గడ్డి పువ్వులు
ఏరుకుంటూ కవనాల్ని సృజిస్తూ
నేను !!

★★★

# క'న్నీళ్ళు' అశోక్ అవారి

**కన్నీళ్ళు రావడం సహజమే**
జీవితాన్ని కుదిపేసే..
కష్టాలు వడగళ్ళై కురిసినప్పుడు.
సంతోషాలకూ..
మనసు దూదిపింజలా మేఘమై తేలి
ఆనంద అల్పపీడనాలక్కూడా
కన్నీళ్ళొస్తాయి అప్పుడప్పుడూ.
ఇక్కడ స్థాయి భావాలు వేరేమో..
ఉబికే కన్నీటి రుచి మాత్రం ఒకటే.
ఒడలు క్షేత్రాన్ని..
శ్రమయంత్రంతో దున్నినప్పుడే
చెమట ముత్యాలు పండుతాయి.
జలధి మరిగి మరిగి..
మబ్బు రూపు కడితేనే
వాన చినుకులు రాలుతాయి.
చెమట ముత్యమై పండితేనే..
దేహ క్షేత్రం శుద్ధవుతుంది.
మబ్బు రూపు కడితేనే..
సంద్రం నీరు సాగు నీరవుతుంది.
మాలిన్యం వదిలితేనే...
మనిషి మరింత అమలినమవుతాడు సుమా!
కష్టాల,కన్నీళ్ళ సారంగాన్ని
ధైర్య గునపంతో తొల్చినప్పుడే కదా,
సుఖాల ద్వారం చేరేది.!
బిందు బిందువునూ..
ఒడుపుగా ఒడిసి పడితేనే కదా,
సింధువై సేద్యం సాగేది.!
విలువ తెలియాలంటే
నీళ్ళయినా..కన్నీళ్ళయినా
అప్పుడప్పుడూ..
ఉబికి వస్తూ ఇంకి పోవాలి.
ఇంకిపోతూ ఉబికి రావాలి

★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇంత వర్షమ్ముతో భువినంత తడిపి
ఎచటికేగెనో జలదమ్ములెవ్వరెరుగు
తిరిగి వచ్చునో, యాయువు తీరిపోయి
వెడలిపోయెనో మననెల్ల విడిచిపెట్టి

ఎచటనున్నవో యని యోచింపరెవరు
తరలిపోయిన మేఘాల తలచరెవరు
అంత కష్టించి యిచ్చిన యమృతమెల్ల
గతములో జారె స్మృతి యెల్ల కరగిపోయె

అమృతమిచ్చిన వారిదమలసిపోయి
వెడలిపోయెనెటకొ వినువీధియందు
వార్షుకాభ్రము వేరొండు వచ్చునిటకు
పరవశించును ధారుణి మరల మరల

ఎందరో మహనీయులీ యిలను నడచి
తరలిపోయిరి ధరను సార్థకము చేసి
చిరనివాసులు కొందరు చరిత పుటల
చరితకందరెందరొ త్యాగనిరతులయ్యు

ఎవరు గుర్తింపకున్న కీర్తింపకున్న
జనులు వారల మరచిపోయినను గాని
సఫల జన్మముల్ వారివి సార్థకములు
నిలుచు వారల సత్కార్య ఫలములిలను



చిత్రం:కె.రామ్మోహన్

## ఒక్కడినే

శిష్ట్లా.వి.ఎల్.ఎస్.శర్మ

ఒక్కడినే
ఇక్కడ నేను ఒక్కడినే
దిక్కులన్నీ నావైపు చూస్తున్నా
నేనొక్కడిగానే శ్వాసిస్తాను!
నావైపు ప్రసరించే
అనురాగాల్నీ, ఆత్మీయతలను ,
విమర్శను, పరామర్శను
ఒక్కడిగానే స్వీకరిస్తాను!
ఇక్కడ నేను ఒక్కడినే....
ఏ వసంతమో పాటై
నా చెవులకు వినిపిస్తే పులకిస్తాను,
ఏ సెలయేటి శబ్దమో ఎలరాగమై
వినిపిస్తే తోడుగా స్వరిస్తాను!
నింగి నేలల ఆశల ప్రభాతాల్ని
వీక్షిస్తూ ఊపిరి పోసుకుంటాను,
పూవై పరిమళిస్తాను
రేకులు రాలి నిష్క్రమిస్తాను!
అంతా నేనొక్కడినే......
అందుకే అందరూ నా వైపు చూస్తారు
అన్నిదిక్కులూ నన్ను గమనిస్తాయి
అన్ని శాస్త్రాలూ నాకు శ్వాసనిస్తాయి
అన్ని సమయాలూ నాకు ప్రభాతాలౌతాయి
ఇక్కడ నేను ఒక్కడినే
ఒక్కడిగానే ఉంటాను
ఆ ఒక్క మనిషిగానే వుంటాను
ఈ దిక్కులన్నీ నావైపు చూసేలా
ప్రకృతినై స్పర్శిస్తాను.....స్పృశిస్తాను....!

***

## మోడర్న్ మల్లెపూదండ

సాయికిరణ్

మా కౌరవ సేన కు మల్లెపూదండ···
అవినీతి నాయకులకు మంగళారతులు···
కడుపు లో కుటిలత్వం, కనుచూపు లో నటన···
చిరునవ్వుతో ముంచు మహరాజ కురు నేత··· ‖మా‖

గలగలా ప్రజా ధనం తరలిపోతుంటేను···
బిరబిరా పరుగెత్తి ఒడిసి పట్టుకునేరు···
పేదోడి కడుపులే ఎండుతాయి···
ఆశక్తులైన గుండెలు మండుతాయి···! ‖మా‖

బలగాల మోపు తో చేసేటి దోపిడీలు···
బలహీనుల గొంతు పై నిలిపేటి పాదాలు···
అధికార శక్తి తో విసిరేటి అస్త్రాలు···
నిత్యమై, నిఖీలమై నిలచి ఉండేదాకా··· ‖మా‖

రౌడీల భుజ శక్తి, వ్యాపారుల ధనభక్తి,
నాయకుల అక్రమ వృత్తి, అధికారపు మధు ప్రీతి···
జన జీవన దీపాలె ఆరిపోయేలాగా···
మీ అన్యాయామే జయించు··· మీ దౌర్జన్యమే ఫలించు···
జై రాజకీయం··· జై రాజకీయం···!

***



## గమ్యం

శ్రీమతి డేగల అనితాసూరి

పలకరింపుల ప్రహసనాలు
రుచుల కలబోతలు
సహాయ హస్తాలు
కొత్త బంధుత్వాలు
కొన్ని చూపుల గిలిగింతలు
రహస్యాకర్షణలు
అనుకోని శతృత్వాలు
స్థలమార్పు యుద్ధాలు
ముగిసాక
నిద్రాదేవి ఒడిని
ఆక్రమించిన మూకుమ్మడికళ్ళు
గమ్యం గద్దింపుతో
ఒక్కసారిగా ఉలిక్కిపడి
భోగీ వదలగానే
రూపంలేని కలలై
ప్రయాణపు పదనిసలు
పొగమంచులా కరిగిపోయాయి!

★★★



# దేవుడున్నాడు

బోడపాటి రమేష్

తెల్లవారింది
పనిమనిషి వచ్చింది
చెప్పిన పని సణక్కుండా చేసింది

నిన్ననే కొత్త గాస్ సిలిండరు వచ్చింది
పిల్లలు స్కూలుకు వాళ్లంతట వాళ్లే తయారయ్యారు
పిల్లల ఆటో వచ్చింది
మా అయన ఫలహారము మెచ్చుకుంటూ తిన్నారు
చాకలి బట్టలు ఉతికింది

వంట రుచిగా కుదిరింది
అమ్మ చాలాసార్లు ఫోను చేసింది
అత్త గారి ఫోను రాలేదు.

ఆయన ఆఫీసు నుండి తొందరగానే వచ్చేసారు
మల్లెపూలు తెచ్చారు
పిల్లలు తొందరగానే పడుకున్నారు
మావారు. ఛీ ...పాడు.
సిగ్గు, నిద్ర పారిపోయాయి
దేవుడున్నాడు!

తెల్లవారింది
దేవుడున్నాడో లేడో.!!?? ★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఎడద లోపలి ప్రేమను నుడువకున్న
నీ మనోభావములు నాకు నిజము కావు
చేలి ప్రేమింతునంచును చెప్పకున్న
నిజము కానేరదెన్నడు నీదు తలపు

కన్నులారగనెపుడైన కాంచు వరకు
మేరుపర్వతమైనను మిథ్య యగును
కాననేరకయుంట యజ్ఞానమేమొ
లేక మేరునగమసలు లేనె లేదొ

ప్రేమ నిండిన భావముల్ వెలువరింప
విలువ కట్టగనెంతును ప్రేమ లోతు
విలువ కట్టినచో ప్రేమ విలువ మారు
లేనిచో భావములు దృశ్యమానమవవు

మదిని దాటని యనుభూతి మన్నికైన
తెలుపవలయును మదిలోన తలపులన్ని
శ్వాస యాగిన వెన్క నిశ్శబ్దసీమ
అంతు తెలియని సతతవిశ్రాంతసీమ

చిత్రచిత్రమీ జగతి చారిత్రమెపుడు
యోచనలకందునవియెల్ల యున్నవిచట
ఏది సత్యమసత్యమేదెవ్వడెరుగు
మనసుకందనివెల్లను మాయలగును



చిత్రం:కె.రామ్మోహన్

# అన్వేషణ

మధుకర్ వైద్యుల

ప్రయాణవేగం పెరుగుతున్న కొద్ది
దూరం తగ్గుతున్నదన్న ధ్యాసే మరిచి
ఒంటరితనాన్ని గుండెల్లో నింపుకొని
ఏకాకిగా సాగుతున్న జీవితం....

చెట్లు చేమలు చెరువులు కొండలు
పక్షులు, జంతువులు ఊర్లకు ఊర్లు
మనుషులు, మనసులు వెనక్కు సాగిపోతుం టే
గమ్యమెరుగని ప్రయాణం...

జీవితమనే నావలో ఒక్కటిగా సాగినా
ప్రయాణంలో ఓచివర నీవు మరో చివరనేను
ఒక్కటయ్యేంత చనువున్నా
ఉల్లిపొరలాంటి ఈగో పెంచిన దూరం

జీవంలేని నవ్వును పెదాల చివర్న అంటించి
తడి ఆరిన గుండెల కౌగిట్లో నలిగిపోయి
మనసులు కలవని శారీరక సుఖాన్ని
చీకటిగదిలో పంచుకోలేక....

బంధాల బంధీఖానలో బానిసనై
బాధ్యతల పేరుతో బందీగా మారి
నేను నువ్వులా సాగి పొగొట్టుకున్న నా అస్తిత్వానికి
విముక్తి గీతలాపనకు పల్లవికోసం

చీకట్లు మోసుకొస్తున్న భయానికి
వేగం పెరిగే హృదయానికి జడత్వాన్ని జతచేసి
స్వతంత్రత లేని జీవితాన్ని చెరిపేసి
స్వేచ్ఛాగాలుల కోసం అన్వేషిస్తూ...

***

# ఎల్లో స్టోన్

రాఘవేంద్రరావు నూతక్కి

ప్రకృతి అందాలకు
పటుగొమ్మ ఆ ప్రదేశం.
అద్భుతమైన లోయలు,
పర్వతాల ఉన్నతాలు,
జలపాతాల ఉరవళ్ళు
సెలయేళ్ళ పరవళ్ళు,
నదులు ప్రవాహోద్రుతులు,
కిరణశోభిత
హిమ కిరీటాల దగద్ధగలు,
మహాద్భుత వన భవ్యస్థలి !
లేళ్ళు , దుప్పులు ,
ఎలుగులు ,ఎనుములు
ఎన్నెన్నో జీవులు
నిర్భీతిగా విహరించే
వన్యజీవ రమ్యస్థలి.!!
సెలయేళ్ళకు
ఇరుపార్శ్వాల
ప్రకృతి శిల్పించిన
శిలాభంగిమల
సమోన్నత దరులు!
వెలుగునీడల
పయ్యెదలతో,
ప్రకృతి కన్నియ
చిన్నెలు,
చూడముచ్చటైన
సుందరప్రదేశం,
సుదూరాలనుండి
పరికిస్తే.
కాని కానీ
దాపులనుండి
నిశితంగా
వీక్షించిచూడు !!

పొగులుతున్నకొండలు,
కంకర కుప్పల్లా
పొడిగామారిన బండలు,
ఇటుకబట్టీలుపేర్చి ,
ఎవరో కాలుస్తున్నట్టులేదూ?
పైపైన కాలినఊక ఆకొండలనుండి
పొరలా జారుతున్నట్టు
కనిపించడంలేదూ ?

భూ అంతర్గర్భంలో.
తనలోతాను
అనుక్షణం
కుములుతు,
క్షోభిల్లుతోంది
దాత్రీమ తల్లి .
విస్ఫోటించని
అగ్నిపర్వతంలా,
బావురుమనలేక,
వెక్కివెక్కిఏడవలేక,
వెలికి చెప్పలేని
తీవ్ర గర్భ క్షోభ...

తమకుతాము
నిర్జించుకుంటూ
తమకుతామే
పునరుత్తేజం
పొందుతూ ,
వృక్షజాలం .

విచిత్ర
చేతనాచేతన స్థితి లో
ధరిత్రి.

తనకై విశ్వభవనాన్ని
నిర్మించుకోను ,
కొండలను పిండిచేయమని.
ప్రకృతి ఓ గుత్తేదారుకు
పనిఅప్పగించినట్లు
అంతర్గర్భం లో ఎవరో
గప్చిప్ గా తనపనితాను
చేసుకుపోతున్నట్టు ,

సలసల మరిగే
పంక హూంకార
విస్ఫోటనలోకవంక,

అత్యుష్ణజల విశృంఖల
ప్రకోపాలోకప్రక్క
సలసలమరిగే మహోగ్రకాసారాలు
ఒకచెంత,

ఆకసానికెగసిపడే భూగర్భజనిత
విశ్రుంఖలజల విన్యాసాలొకపొంత,

ఆప్రాంతం
భయకంపిత పంక క్రీడా స్థలి ,
ఆప్రాంతం ఓ నివురుకప్పిన అగ్నిగుండం.
ఆప్రాంతం ఓ మహోగ్ర రసాయన రంగస్థలి
ఆప్రాంతం భూగర్భ విస్ఫోటిత జల
నాట్యస్థలి.

భూగర్భ వుద్భవ అజీర్ణ
కశ్మల వుద్గార విసర్జన స్థలి
అది
ఎల్లోస్టన్ జాతీయ వన్యస్థలి..!!

★★★

# సందేహం

శారద శివపురపు

కాలం పేర్చుకుపోతోంది
పగలూ రాత్రుల మధ్య
రోజ మీద రోజని
ఇటుక మీద ఇటుకలా,
శరీరం రాలుస్తూపోతోంది
కణం కణం,
క్షణం, క్షణం
ఇసుక రేణువుల్లా!
హమేషా మనసు తపన
అనుభవాల ఇటుకలను
ఏరి కోరి పేర్చాలని,
దారిచూపే మైలురాళ్ళలా,
అడుగుజాడలుగా,
మెట్టు మెట్టుగా పరవాలని
తర తరాల వారసులకి.!
మధ్య మధ్య దారిలోన
ఏ మలుపెటు పోతుందో,
ఏ తలుపెలా తెరుచుకుంటుందో
ద్వారాల్లాంటి గోడలుంటాయని
వాటిలోకి చొరబడితే తల బొప్పి
కడుతుందని చెప్పాలని.
దారి చూపే దేవతలరుదని
నీవెళ్ళే దారి తప్పని వెక్కిరించి
దారి మరల్చే వారు కొల్లలని
ఏ మలుపు గెలుపు తలుపో
ఏ తలపు ఓటమి పిలుపో
ఎవరెన్నన్నా విని నీవెన్నుకున్న
దారినే వెళ్ళాలని చెప్పాలని.!
అలువక, సెలవిక తలవక
సడలక కదలిక విడువక
నడచిన గమ్యపు నెలవిక
నీదని మరువకమని చెప్పాలని....!
కానీ ఒకే సందేహం
ఒకటే సందిగ్ధం
ముందుతరాల అడుగులు

## చిన్ని ఆశ

నీలూ

నీలినింగి మబ్బులతో సాగాలని చిన్ని ఆశ
గువ్వలాగ రివురివ్వున ఎగరాలని చిన్ని ఆశ

చిరుసవ్వడి కులుకులతో వాగువంక సాగుతుంటె
తీరాలను అలనేనై తాకాలని చిన్ని ఆశ

దూరాలే చేరువయ్యె నింగినేల కలియుచోట
కెరటాన్నై ఆకసాన్ని అందాలని చిన్ని ఆశ

దనుమాడిన శిశిరంలో వనమంతా చిన్నబోతె
ఆమనిలో నేసుమమై విరియాలని చిన్ని ఆశ

తపియించే పుడమికన్నె కరిమబ్బుకు ఎదురుచూసె
పంటచేల శ్రావణమై కురియాలని చిన్ని ఆశ

పున్నమిలో 'నీల'కనుల నెఱవెన్నెల నిండుతుంటె
లెక్కలేని చుక్కలనే చూడాలని చిన్ని ఆశ

***



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

చెంత నీవున్న యప్పుడే జీవితమ్ము
మరలి పోయితివో యది మరణసమము
కలసి మనమీ పుడమి స్వర్గతలము చేయ
స్వర్గమే యౌను జీవిత చరమదశయు

ప్రేమ తలుపులు బంధించి వెడలినంత
దారి కనుగొనమానంద ధామమునకు
ఇనుప ద్వారమ్ములను కరగించుటెట్లు?
వీలు పడునది ప్రేమాశ్రు బిందువులకె

రాగమన్నది యెరుగని బ్రతుకునందు
పూల పరిమళములు లేవు పూలు లేవు
కనుల రాగాశ్రువులు లేవు కరుణ లేదు
నెమ్మదియు మనసుకు మృదుత్వమ్ము లేవు

సర్వమును ప్రేమ మయమైన జగతి యందు
క్షణములన్నియునానంద సాధకములు
అణువులన్నియు శీతల కణగణములు
చెలిమి వెల్లువయే ప్రతి జీవితమ్ము

ఎన్నొ ముదమును గూర్చునవున్నవిలను
పొందినప్పుడె సంతృప్తినందగలము
కనులనొండొరు గాంచిన కరగిపోవు
మృదులతమహృదయమ్ము ప్రేమికులదెపుడు



చిత్రం:కె.రామ్మోహన్

# ఊపిరి కొసనే.. ఉమా నూతక్కి

ఉండుండీ అలికిడి చేసే జ్ఞాపకంలాంటి సెలయేరులా
వెళ్తూ వెళ్తూ ఒక ముద్రని వదిలే జలపాతంలా
ఎండమావి అంశతో ఆచూకి ఇస్తుంటాడతను

తెలిసీ తెలియని కలల్లోనో
అందీ అందని కలవరంలోనో
ఉండీలేనట్లు ఉంటాడతను..

వర్ణాల్లోనో.. రేఖల్లోనో..
మల్లెల్లోనో.. తుమ్మెదలోనో
ఎక్కడో ఉండే ఉంటాడు తను

ఆకృతుల్లోనో.. అక్షరాల్లోనో
మాటల్లోనో.. మౌనంలోనో
ఎక్కడో ఉంటాడతను.

నేలకి దిగివచ్చి నా లోగిలిలో దీపమైన నక్షత్రంలా
మది ప్రమిద నిండా వెలుగులీనుతున్న దీపహారతిలా
చీకటిపుండుని వెలుగు పండుగా మార్చే వైద్యునిలా
గుండె నిండా స్నేహ వేదాన్ని వల్లెవేసే ఆత్మైక్య నేస్తంలా
జీవితాన్ని ముని వేళ్ళతో స్పర్శిస్తుంటాడతను

తనని బంధించి భద్రపరచుకోవడానికి
నా అస్తిత్వమేదని వెదుకులాడుకునేంతగా
తనలోకి నన్ను లీనం చేసుకోవడం తెలిసాకే
అర్థమైంది....తనెక్కడో లేడని
అభౌతికమైన జీవంగా నా చుట్టూ ఆవరించి ఉన్నాడని
తన అస్తిత్వాన్నెప్పుడూ
నా ఊపిరి కొసనే దాచుకుని ఉంటాడని !

★★★★

# ఒకడు

శతపత్ర మంజరీ

తుమ్మెద దేహాన్ని
ముళ్ళతో గుచ్చుతూ
కనుమరుగయ్యే సున్నితత్వం గురించి
ప్రతిక్షణం దిగులు చెందుతున్నాడొకడు

సీతాకోకచిలుక బొమ్మను
వర్ణచిత్రంలో బంధించి
దారంతో గాల్లో వేలాడదీసి
స్వేచ్ఛ గురించి మాట్లాడుతున్నాడొకడు

కాళ్ళకిందపడి నలిగి విరిగిన
గాజు పెంకును తీసి
పరిశీలనగా చూసి
చరిత్ర తవ్వకాలకు బయల్దేరాడొకడు

ఏ గాలి వాటుకు
ఎటు ఎగిరిపోతాయో
ఏ వాన దాటికి
ఎటు ఒరిగిపోతాయో
తెలియని గడ్డిపోచలను
నమ్ముకుని సిద్ధాంతాలను రాస్తున్నాడొకడు

నీతి మాటల చివర రక్తాక్షరమై
తేటగీతుల నడుమ గరళబిందువై
చీకటినంతా కుప్పలు తెప్పలుగా రాశిపోసి
వెలుగుపై,వెతలపై,జారిపోతున్న కథలపై
పుస్తకాలలో నిర్జీవాక్షరాలను నాటుతున్నాడొకడు

★★★

## సొంతం — షేక్ షహనాజ్

ప్రకృతి అందం కన్నుల సొంతం
కష్టాలన్నీ కన్నీళ్ళ సొంతం

ఇష్టాలన్నీ మనసుకు సొంతం
ప్రాణం మొత్తం ఊపిరి సొంతం

లక్ష్యం ఎప్పుడూ గెలుపు కు సొంతం
సంతృప్తి సంతోషానికి సొంతం

పగలు రాత్రి రోజు కు సొంతం
ప్రతి దినమూ జీవితానికి సొంతం

మతం ఎప్పుడూ మనిషి కి సొంతం
మానవత్వం మాత్రం ఆత్మ కు సొంతం

మంచీ చెడు లో ఏదీ ఎంచుకున్న ఫలితం మనకే సొంతం
అవున్నన్నా కాదన్నా మనము మటుకు మట్టి కే సొంతం!

★★★★



## ఎన్ని? — డా.సి.భవానీదేవి

ఎన్ని మబ్బులు కావాలి
నా కన్నీటి భారాన్ని మోయటానికి,
ఎన్ని సముద్రాలు కావాలి
నా హృదయ ఘోష లయించుకోటానికి,
ఎన్ని నదులు కావాలి
నా దుఃఖ వాహిని ప్రవహించటానికి,
ఎన్ని కిరణాలు కావాలి
నా గమ్యాన్ని చేరుకోటానికి,
ఎన్ని అక్షరాలు కావాలి
నా జ్వలనాన్ని ఆవిష్కరించటానికి,
ఎన్ని పాటలు కావాలి
నా చుట్టూ పీడన ఎదిరించటానికి
ఎన్ని వేదికలు కావాలి
నా న్యాయవాదం వినిపించటానికి,
ఎన్ని ఆయుధాలు కావాలి
నా శత్రువుల దాడి ఎదుర్కోటానికి,
ఎన్ని జన్మలు కావాలి
నన్ను నేను పునరుజ్జీవించుకోటానికి!!

★★★★



## గజల్

డా.వడ్డేపల్లి కృష్ణ

బట్ట పొట్ట  బాగుంటే అదే పండుగ
పస్తులతో పడివుంటే బతుకు ఎండుగ ||బ||

ఎంతగనువ్వు ఆర్జించిన ఏమాత్రం
కడుపుకు తినలేకుంటే కలిమి దండగ! ||బ||

బంధుమిత్రులెందరినో కలిగున్నా
పలకరింపు లేకుంటే పరమ దండగ! ||బ||

అంతకంతకూ కాంక్షలు అన్ని తీరినా
ఎదిగేను ఆశలెన్నో ఎదను మెండుగ ||బ||

పల్లెలన్ని పచ్చగ అగుపించాలంటే
నిరతము నీరుండాలి చెరువు నిండుగ ||బ||

అవినీతి బంధుప్రీతి దేశాన్నే
మానక పీడిస్తోంది రాచపుండుగ ||బ||

బాలపురోగతిని సాధించాలంటే
ఉండాలీ వడ్డెపల్లి! కృషియెదండిగ ||బ||

★★★



# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

జీవితము జ్వలియించు కార్చిచ్చు వోలె
మనసు వెలుగును విరజిమ్ము మంట వోలె
మిగిలి నిల్చునదేమి ప్రేమికులకిలను
ఆరిపోవక నిల్చు దివ్యాగ్ని ప్రేమ

కరుగు కొవ్వొత్తి యొసగును కాంతి మనకు
కాంతి నేలకు జారి చీకటియె మిగులు
చీకటిని కోరి తోడుగా చేసికొన్న
ఇంత వరకెరుగని క్రొత్త కాంతి తోచు

ఏది నిలువకనెచటికో యేగుచుండు
మిగిలిపోయినవవి గూడ మిధ్య యౌను
వెడలిపోయిన దానిని వెదకికొనగ
వచ్చి చేలియు మరల తా పయనమౌను

ఎన్ని యానంద ఘడియలునెన్ని వ్యథలు
ఎన్ని యనుభవమ్ములు మరి యెన్ని కథలు
దృశ్యమానమై మరల యదృశ్యమగును
పంచు ప్రేమయె తోచు శాశ్వతమటంచు

వెడలిపోయిననేమి జీవితపు వెలుగు
ఇచట మిగిలిననేమి యీ యిరుల తెరలు
అమరమై చెలువొందు ప్రాణములు రెండు
అంకురించును ప్రేమచిహ్నమ్ములిలను



చిత్రం:కె.రామ్మోహన్